RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 352 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 18-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


### నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

కోడెకెదురుగాను , గుర్రము వెనుకను,
మూర్ఖునికిని ప్రక్క ముప్పుసుమ్ము
పొడుచు,తన్ను,చంపబూనును నిజమది
జాగరుకతనున్న బాగుబాగు

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి, తెలుగు బోధకులు


## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




### కాంగ్రెస్ నేత రాహుల్

# గాంధీకి షాక్..

- రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం
- బ్రిటన్ పౌరసత్వం కలిగి ఉన్నట్లు ఆరోపణలు
- ద్వంద్వ పౌరసత్వంపై విచారణకు అలహాబాద్ హైకోర్టు ఆదేశం

**న్యూఢీల్లీ**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి యూపీలోని అలహాబాద్ హైకోర్టు షాకిచ్చింది. ఆయనపై వచ్చిన ద్వంద్వ పౌరసత్వం ఆరోపణలపై విచారణ జరపాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. లేదా ఈ అంశాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలకైనా అప్పగించాలని సూచించింది. అలహాబాద్ హైకోర్టుకు చెందిన లక్నో బెంచ్ శుక్రవారం ఈ అంశంపై ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై విచారణకు యూపీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం కలిగి ఉన్నాడని ఆరోపణలున్నాయి. దీనిపై గత ఏడాది డిసెంబర్ 17న రాయ్‌బరేలిలోని ఎంపీ, ఎమ్మెల్యే స్పెషల్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను కోర్టు లక్నో కోర్టుకు

-మిగతా 2 లో

### ప్రపంచానికి

# ఇరాన్ శుభవార్త

- హోర్మూజ్ జలసంధి తెరిచి ఉంటుందని ప్రకటన
- కాల్పుల విరమణ ఒప్పంద కాలం ముగిసేవరకూ హోర్ముజ్ పూర్తిగా తెరిచి ఉంటుందని ఎక్స్ వేదికగా వెల్లడి
- ఇరాన్ ప్రకటనతో భారీగా తగ్గిన ఆయిల్ ధరలు
- దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు



**టెహ్రాన్,**

ప్రపంచానికి ఇరాన్ శుభవార్త అందించింది. ర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచినట్లు ప్రకటించింది. ఇజ్రాయిల్, లెబనాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు అమాంతంగా పడిపోయాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ రవాణాకు కీలకంగా మారిన హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పంద కాలం ముగిసేవరకూ హోర్ముజ్ పూర్తిగా తెరిచి ఉంటుందని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇరాన్ తాజా ప్రకటనతో.. హోర్ముజ్ జలసంధిలో ఇకపై అన్ని వాణిజ్య నౌకలకు ప్రవేశం ఉంటుంది.

-మిగతా 2 లో

## వీగిన మహిళా

# రిజర్వేషన్ బిల్లు

**బిల్లుకు అనుకూలంగా 298... వ్యతిరేకంగా 230 ఓట్లు..**


### 131వ రాజ్యాంగ సవరణ
### బిల్లుకు దక్కని ఆమోదం

- మిగిలిన రెండు బిల్లులు ఉపసంహరణ
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి
- ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం

**న్యూఢిల్లీ,**

మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మూడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది.

-మిగతా 2 లో



### రాహుల్ నేతృత్వంలో విపక్షాలు

# ఐక్యత చాటాయి

- జాతీయ విపత్తును నివారించిన రోజు
- ఇందుకు సహకరించిన విపక్ష నేతలకు కృతజ్ఞతలు
- ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి



**న్యూఢిల్లీ,**

ఇవాళ జాతీయ విపత్తును నివారించిన రోజు అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్షాలు కలిసి జాతీయ విపత్తును నివారించాయన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి స్పందించారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జాతీయ విపత్తును అడ్డుకున్నారు. దేశ చరిత్రలో సువర్ణదినంగా ఇవాళ గుర్తుండిపోతుంది. నల్ల బిల్లులను ఓడించేందుకు ఏకమైన మిత్రపక్షాల నేతలకు ధన్యవాదాలు అని రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. లోక్‌సభలో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్

-మిగతా 2 లో

### అంబానీని మించిన అదానీ

- ఆసియాలోనే టాప్ కుబేరుడిగా చోటు

2 లో






### ఆగని కేకేఆర్

# ఓటముల పరంపర..

- గుజరాత్ హ్యాట్రిక్ విక్టరీ
- ఈ సీజన్‌లో ఐదో మ్యాచ్‌లో ఓడిన కోల్‌కతా
- అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌పై పరాభవం
- హ్యాట్రిక్ విక్టరీ నమోదు చేసిన గిల్ సేన

2

### తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే

# ఊరుకోము

**దశాబ్దాల ప్రజా పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం**

- శాంతియుత, ప్రజాస్వామ్య ఉద్యమాన్ని అవమానించడం తగదు
- తెలంగాణ ప్రజల భావోద్వేగాలకు గౌరవం ఇవ్వాలి
- బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య క్షమాపణ చెప్పాలి
- టీపీసీసీ అధికార ప్రతినిధి ఠాకూర్ బాలాజీ సింగ్






**హైదరాబాద్, ఏప్రిల్ 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ఉద్యమ స్ఫూర్తిపై అవగాహన లేకుండా పార్లమెంట్ వేదికగా చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయని టీపీసీసీ అధికార ప్రతినిధి, ప్రముఖ ఉద్యమకారుడు బాలాజీ సింగ్ ఠాకూర్ తీవ్రంగా ఆక్షేపించారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, తెలంగాణ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.దశాబ్దాల పాటు సాగిన ప్రజా పోరాటం, త్యాగాలు, ఆత్మగౌరవ సంకల్పం కలిసిన ఫలితమే తెలంగాణ రాష్ట్రం అని బాలాజీ సింగ్ ఠాకూర్ స్పష్టం చేశారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మేధావులు--- అందరూ ఒక్కటై సాధించిన విజయాన్ని తేలికగా తీసుకోవడం తగదన్నారు. "తెలంగాణ ఉద్యమం ఎక్కడా హింసకు తావులేకుండా, శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో సాగింది.

-మిగతా 2 లో



# కోట్ల కట్టలు బయటపడ్డా...

# నిజం నజరేది...?

- డబుల్ డబ్బు మాయలో కోట్ల మోసం? గోకులనందన ఇన్ఫ్రా మిస్టరీ
- నోట్ల గుట్టలు... పెట్టుబడిదారుల కన్నీళ్లు! అసలు కథ ఏమిటి?
- క్యాష్ వీడియోలు వైరల్... అధికారుల మౌనం ఎందుకు?
- గోకులనందన ఇన్ఫ్రా షాక్ డబ్బు ఎక్కడికి మాయం?
- "నీలగిరి ఎక్స్ ప్రెస్" ఎక్స్ క్లూజివ్

GOKULA NANDANA INFRA INDIA PRIVATE LIMITED MIYAPUR, HYDERABAD - 500049

**హైదరాబాద్,ఏప్రిల్ 17 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**

రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన గోకులనందన ఇన్ఫ్రా వ్యవహారం కొత్త మలుపులు తిరుగుతోంది. అధిక వడ్డీ, డబుల్ రాబడి ఆశ చూపించి కోట్ల రూపాయల పెట్టుబడులు సేకరించారన్న ఆరోపణలు ఒకవైపు, భారీ మొత్తంలో నగదు కట్టల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం మరోవైపు ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతున్నాయి. అడ్వకేట్ సుబ్బారావు విడుదల చేసిన వీడియోలో సంస్థ కార్యకలాపాలపై తీవ్రమైన ఆరోపణలు వెలువడ్డాయి. ఈ వ్యవహారంలో ప్రముఖ గాయని మంగ్లీ పేరును కూడా ప్రస్తావించడం వివాదానికి దారితీసింది.

-మిగతా 2 లో



## కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి షాక్..

మొదటి తరువాయి

మార్చింది. ఈ పిటిషన్‌ను లక్నో కోర్టు డిస్మిస్ చేసింది. దీన్ని సవాలు చేస్తూ కర్ణాటక బీజేపీకి చెందిన నేత విఘ్నేశ్ శిశిర్.. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాహుల్ ద్వంద్వ పౌరసత్వం కలిగి ఉన్నారని, అందువల్ల ఆయనపై అఫీషియల్ సీక్రెట్ యాక్ట్, ఫారెనర్స్ యాక్ట్, పాస్‌పోర్ట్ యాక్ట్ కింద బీఎన్ఎస్ ప్రకారం కేసులు నమోదు చేయాలని కోరారు. దీనిపై విచారించిన అలహాబాద్ హైకోర్టు తాజాగా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. రాహుల్‌పై కేసు నమోదు చేయాలని సూచించింది. రాహుల్ గాంధీపై బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి చాలాకాలంగా దీనిపై ఆరోపణలు చేస్తున్నారు. రాహుల్ గాంధీకి బ్రిటీష్ పౌరసత్వం ఉందన్నారు. అక్కడి ఒక కంపెనీలో ఆయన డైరెక్టర్‌గా ఉన్నట్లు కూడా సుబ్రహ్మణ్య స్వామి ఆరోపించారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో రాహుల్ గాంధీని బ్రిటీష్ పౌరుడిగా పేర్కొన్నట్లు స్వామి చెప్పారు. ఇలా ఇండియాలో ఉంటూ, మరో దేశంలో పౌరసత్వం కలిగి ఉండటం నేరమని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై కేంద్రానికి కూడా ఆయన లేఖ రాశారు.

## ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

మొదటి తరువాయి

అంతర్జాతీయ వాణిజ్య రవాణాకు కీలకమైన ఈ జలమార్గంలో వాణిజ్య నౌకల ప్రయాణాలకు మార్గం సుగమమైంది. ఇరాన్, ఇతర దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే ఈ జలమార్గంపై.. కొన్ని నెలలుగా వివాదాలు కొనసాగుతున్నప్పటికీ, కాల్పుల విరమణ సమయం ముగిసేవరకూ.. యథావిధిగా వాణిజ్య రవాణా కొనసాగించవచ్చని ఇరాన్ స్పష్టం చేసింది. కాగా.. హోర్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సుమారు 20 శాతం ప్రపంచ క్రూడాయిల్ సరఫరా అవుతుందన్న విషయం తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడ డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగను న్నాయని తెలిపారు. ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది.

## ఆగని కేకేఆర్ ఓటముల పరంపర..


-గుజరాత్ హ్యాట్రిక్ విక్టరీ
-ఈ సీజన్‌లో ఐదో మ్యాచ్‌లో ఓడిన కోల్‌కతా
-అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌పై పరాభవం
-హ్యాట్రిక్ విక్టరీ నమోదు చేసిన గిల్ సేన

న్యూఢిల్లీ

ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఓటముల పరంపర కొనసాగుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఒక్క గెలుపు కూడా లేని కేకేఆర్, మళ్లీ ఓడిపోయింది. కమ్ బ్యాక్ ఇవ్వాలని గట్టి సంకల్పంతో బరిలోకి దిగిన కోల్‌కతా గుజరాత్‌పై తేలిపోయింది. బౌలింగ్‌లో గట్టిపోటీ ఇచ్చి ఆఖరి ఓవర్ వరకూ మ్యాచ్‌ని తీసుకొచ్చింది. అయితే, చివరి ఓవర్‌లో గుజరాత్ విజయం సాధించడంతో కేకేఆర్ ఈ సీజన్‌లో ఐదో ఓటమిని ఎదుర్కొంది. ఈ విజయంతో గుజరాత్ హ్యాట్రిక్ విక్టరీ నమోదు చేసింది.అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్ – కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి, బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ 20 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌట్ అయింది. ఒకానొక దశలో 200కు పైగా స్కోర్ చేసేలా కనిపించిన కోల్‌కతా ఆఖరి ఐదు ఓవర్లలో వరుస వికెట్లు కోల్పోయి 180 పరుగులకే పరిమితమైంది.హోం గ్రౌండ్‌లో ఈజీ టార్గెట్‌తో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ జట్టు ఆరంభం నుంచి దూకుడుగానే ఆడింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బౌండరీల మోత మోగించగా, సాయి సుదర్శన్ కూడా ఫర్వాలేదు అనిపించాడు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 57 పరుగులు జోడించారు. సాయి సుదర్శన్ 16 బంతుల్లో ఒక ఫోర్, రెండు సిక్సర్లతో 22 పరుగులు చేసి అవుటయ్యాడు. పవర్ ప్లేలో గుజరాత్ 71 పరుగులు బాదేసింది.జోస్ బట్లర్ కూడా 15 బంతుల్లో రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 25 పరుగులు చేసి పెవిలియన్‌కు వెళ్లగా, వాషింగ్టన్ సుందర్ 13 బంతుల్లో 13 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. సెంచరీకి అతి దగ్గర ఉన్న సమయంలో కెప్టెన్ శు భ్‌మన్ గిల్ అవుటయ్యాడు. 50 బంతులు ఆడిన గిల్ ఎనిమిది ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 86 పరుగులు చేశాడు. ఆఖరి ఓవర్‌లో విజయానికి ఐదు పరుగులు కావాల్సిన సమయంలో 16 బంతుల్లో 19 పరుగులు చేసిన గ్లెన్ ఫిలిప్స్ అవుటయ్యాడు. ఆ తర్వాత షారూఖ్ ఖాన్, తెవాటియా మ్యాచ్‌ని ముగించారు. తెవాటియా 7, షారూఖ్ 3 పరుగులు చేయడంతో 19.4 ఓవర్లలో విజయం సాధించింది. ఈ విజయంతో గుజరాత్ హ్యాట్రిక్ విక్టరీ అందుకుంది.

## అంబానీని మించిన అదానీ

### ఆసియాలోనే టాప్ కుబేరుడిగా చోటు



ముంబయి :
అదానీ గ్రూపు చైర్మెన్ గౌతం అదానీ సంపదలో ముకేశ్ అంబా నీని దాటేశారు. ఇటీవల అదానీ గ్రూప్ షేర్లు మార్కెట్‌లో దూసుకుపోవడంతో గౌతమ్ అదానీ తన చిరకాల ప్రత్యర్థి ముకేశ్ అంబానీని వెనక్కి నెట్టి ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా అవతరించారని బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ వెల్లడించింది. ఈ రిపోర్ట్ ప్రకారం.. అదానీ నికర విలువ 92.6 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.5లక్షల కోట్లు)కు చేరుకోగా.. అంబానీ 90.8 బిలియన్ డాలర్ల (8.40 లక్షల కోట్లు)తో తర్వాతి స్థానానికి పడిపోయారు. కేవలం ఒక్క రోజులోనే అదానీ తన సంపదకు 3.56 బిలియన్లు (రూ.33వేల కోట్లు) జోడించుకోవడం గమనార్హం. అంతర్జాతీయంగా అదానీ ర్యాంక్ 19గా, అంబానీ ర్యాంక్ 20గా ఉంది. టాప్ 500లో 23 మంది భారతీయ పెట్టుబడిదారులున్నారు. అధిక ధరలతో సామాన్యుడి జేబు ఖాళీ అవుతున్న వేళ.. బిలియనీర్ల ఆస్తుల పెరుగు దలపై జరుగుతున్న చర్చ ఆర్థిక నిపుణుల్లో ఆలోచన రేకెత్తిస్తోంది. పెరుగు తున్న ద్రవ్యోల్బణం, చమురు ధరల అస్థిరత, తగ్గుతున్న కొనుగోలు శక్తి కారణంగా సామాన్యుల పొదుపు హరించుకుపోతోంది. ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్న తరుణంలో సగటు భారతీయుడి వాస్తవ ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో వృద్ధి చెందకపోవడం గమ నార్హం.ఈ ఏడాదిలో ఇప్పటి వరకు అదానీ సంపద 8.1 బిలియన్ డాలర్లు పెంచుకున్నారు. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్ 20 కుబేరులలో ఏడుగురు నష్టాలను చవి చూశారు. అంబానీ సంపద కూడా 16.9 బిలియన్ డాలర్ల మేర తగ్గింది. అయినప్పటికీ వీరిద్దరి మధ్య ఉన్న పోటీ కేవలం 1.8 బిలియన్లకే పరిమితమైంది. స్టాక్ మార్కెట్ ఒడిదు దుకులపై ఆధారపడి సాగే ఈ నంబర్ వన్ పోరులో సామాన్యుల భాగ స్వామ్యం మాత్రం వరుస నష్టాలతో ఆందోళకరంగా ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందని ఒకవైపు గణాంకాలు చెబుతున్నప్పటికీ ఆ సంపద కేవలం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందనే ఆందోళన ఆర్థిక నిపుణుల్లో వ్యక్తమవుతోంది. అదానీ, అంబానీల మధ్య సాగుతున్న ఈ సంపద యుద్ధం అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్టను పెంచుతు న్నట్లు కనిపిస్తు న్నప్ప టికీ, క్షేత్రస్థాయిలో సామాన్యుడి కష్టాలు, ఆదాయ అసమానతలు మాత్రం ఇంకా సవాలుగానే మిగిలి ఉన్నాయి. ఈ సంపద కేంద్రీకరణ సంకేతాలు భవిష్యత్తులో సామాజిక, ఆర్థిక అంతరాలను పెంచుతాయనేది సుస్పష్టం.

# వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

మొదటి తరువాయి



బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ పక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గ్టటెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోడీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

# రాహుల్ నేతృత్వంలో విపక్షాలు ఐక్యత చాటాయి

మొదటి తరువాయి

రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. విపక్ష నేతలందరూ ఏకమై ఒక 'జాతీయ విపత్తును' నివారించారని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన సందేశంలో ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావించారు. భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చిరస్థాయిగా నిలిచిపోయే ఒక మరపురాని రోజని సీఎం అభివర్ణించారు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావడంపై రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతే ఈ విజయాన్ని సాధించిందని తెలిపారు. ఈ బిల్లులను 'నల్ల బిల్లులు'గా పేర్కొంటూ.. వీటిని ఓడించేందుకు కఠిన పరిస్థితుల్లోనూ సాహసంతో నిలబడినందుకు విపక్ష కూటమిలోని మిత్రపక్షాల నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోరాటంలో అండగా నిలిచిన దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులందరినీ సీఎం రేవంత్ రెడ్డి పేరుపేరునా ప్రస్తావించారు. వీరిలో ఎం.కే. స్టాలిన్ తమిళనాడు, మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్, అఖిలేశ్ యాదవ్, ఉత్తర్ ప్రదేశ్ శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే (మహారాష్ట్ర), లాలు ప్రసాద్ యాదవ్ బిహార్ ,హేమంత్ సోరెన్ జార్ఖండ్, అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ వీరితో పాటు ఫరూఖ్ అబ్దుల్లా, నవీన్ పట్నాయక్, కమ్యూనిస్ట్ పార్టీల నాయకులకు కూడా ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రకటన జాతీయ రాజకీయాల్లో తెలంగాణ పోషిస్తున్న క్రియాశీలక పాత్రను స్పష్టం చేస్తోంది. ఈ బిల్లు వీగిపోవడం కేంద్ర ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బగా విపక్షాలు భావిస్తున్నాయి. దక్షిణాది నుంచి రేవంత్ రెడ్డి జాతీయ స్థాయి మిత్రపక్షల నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకమవ్వడం శుభ పరిణామమని సీఎం అభిప్రాయపడ్డారు. ఇదిలావుంటే భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా.. ఢిల్లీలోని అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాధాకృష్ణన్ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతిగా సేవలందించారన్నారు. భారతదేశం గర్వించదగ్గ గొప్ప తత్వవేత్త, విద్యావేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

# కోట్ల కట్టలు బయటపడ్డా... నిజం నజరేది..?

మొదటి తరువాయి

అయితే ఈ ఆరోపణలను మంగ్లీ ఖండిస్తూ, తనపై కక్షపూరితంగా తప్పుడు ప్రచారం జరుగుతోందని స్పష్టం చేశారు.

**- నోట్ల కట్టల లెక్కలు: కోట్లలో డబ్బు?**

వైరల్ వీడియోలో కనిపిస్తున్న నోట్ల కట్టలు అసలు ఎవరికి చెందినవి? వాటిని లెక్కించిన తర్వాత ఎక్కడికి తరలించారు? అనే ప్రశ్నలు ఇప్పటికీ మిస్టరీగానే ఉన్నాయి. రెండు వందల, ఐదు వందల నోట్ల కట్టల లెక్కల ప్రకారం అక్కడ ఉన్న మొత్తం కోట్లలో ఉండొచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. పెట్టుబడిదారులు తమ కష్టార్జిత సంపాదనను అధిక లాభాల ఆశతో పెట్టుబడిగా పెట్టి మోసపోయారని బాధితులు ఆరోపిస్తున్నారు.

**- అధికారుల మౌనం ఎందుకు?**

ఇంత పెద్ద స్థాయిలో ఆరోపణలు, నగదు కట్టల వీడియోలు వెలుగులోకి వచ్చినప్పటికీ సంబంధిత శాఖలు ఇప్పటివరకు స్పష్టంగా స్పందించకపోవడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది. పోలీసులు, ఆదాయపు పన్ను శాఖ వంటి సంస్థలు ఈ వీడియోలపై దృష్టి సారించలేదా? లేక దర్యాప్తు జరుగుతున్నప్పటికీ బయటకు వెల్లడించడం లేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మనీ ట్రైల్, అకౌంట్లలో లావాదేవీలు, నగదు మూలాలు వంటి కీలక అంశాలపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం గమనార్హం. పెద్ద మొత్తంలో నగదు కనిపించినప్పటికీ అధికారికంగా ఎటువంటి ప్రకటనలు రాకపోవడం ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతోంది.

**- సీఐడీ ఎంట్రీ అసలు నిజం వెలుగులోకి వస్తుందా?**

మైక్రో ఫైనాన్స్ పేరిట వసూళ్లు, బెదిరింపులు, మోసాల ఆరోపణలతో కేసు తీవ్రరూపం దాల్చింది. సీఐడీ రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టిన అధికారులు త్వరలో కీలక విషయాలను వెలుగులోకి తీసుకురానున్నారని సమాచారం.

GOKULA NANDANA
INFRA INDIA PRIVATE LIMITED
MIYAPUR, HYDERABAD - 500049

**- రాష్ట్రవ్యాప్తంగా చర్చ నిజం ఏది?**

గోకులనందన ఇన్ఫ్రా వ్యవహారం ఇప్పుడు రాష్ట్రస్థాయిలో హాట్ టాపిక్‌గా మారింది. పెట్టుబడిదారుల డబ్బు భద్రత, నమ్మకంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నోట్ల కట్టల వెనుక ఉన్న అసలు కథ ఏమిటి? పెట్టుబడిదారుల డబ్బు ఎక్కడికి వెళ్లింది? అనే ప్రశ్నలకు సమాధానం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

**(మరిన్ని వివరాలు త్వరలో మీ నీలగిరి ఎక్స్ ప్రెస్ దినపత్రికలో...)**

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ఊరుకోము

మొదటి తరువాయి



ఇది ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే పోరాటం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఉద్యమానికి నాయకత్వం వహించిన కే. చంద్రశేఖర్ రావు పాత్రను ప్రస్తావిస్తూ, ఆయన నాయకత్వంలో తెలంగాణ ఉద్యమం జాతీయ స్థాయిలో ప్రాధాన్యత పొందిందన్నారు. రాష్ట్ర విభజనను హింసతో పోల్చడం అసంబద్ధమని, ఆంధ్ర--తెలంగాణలు అన్నదమ్ముల్లా పరస్పర గౌరవంతో విడిపోయాయని స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక నిర్ణయం తీసుకున్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పాత్రను గుర్తు చేస్తూ, రాజకీయ నష్టాన్ని తెలిసినా రాష్ట్ర ఆవిర్భావానికి మార్గం సుగమం చేసిందని తెలిపారు. అదే సమయంలో ఉద్యమానికి మద్దతుగా నిలిచిన సుష్మ స్వరాజ్, రాజ్‌నాథ్ సింగ్ వంటి జాతీయ నాయకుల సహకారం తెలంగాణ సాధనలో కీలకమైందని పేర్కొన్నారు. 'తల్లి, బిడ్డ ఆరోగ్యం కోసం కొన్ని సందర్భాల్లో శస్త్రచికిత్స అవసరమైనట్లే, ప్రాంతీయ అవసరాల దృష్ట్యా రాష్ట్ర విభజన కూడా అవసరమైంది. అది తప్పు కాదు, సమయోచిత నిర్ణయం" అని బాలాజీ సింగ్ ఠాకూర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ వంటి అత్యున్నత వేదికలో మాట్లాడే ప్రతి మాట దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుందని గుర్తుచేస్తూ, చరిత్ర, సంస్కృతి పట్ల అవగాహనతో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గౌరవిస్తూ, చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని బాలాజీ సింగ్ ఠాకూర్ మరోసారి స్పష్టం చేశారు.

# తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**సికింద్రాబాద్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత రాజ్యాంగానికి లోబడి పార్లమెంటులో ఆమోదం పొంది ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని బిజెపి ఎంపీ తేజస్వీ సూర్య దేశ విభజనతో పోల్చి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పికెట్‌లోని జెబియస్ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, అవకాశం వచ్చినప్పుడల్లా బిజెపి పార్టీ తెలంగాణపై తన ద్వేషాన్ని బయటపెడుతుందని, గతంలో ప్రధాని మోడీ కూడా తల్లి నుంచి బిడ్డను వేరు చేశారని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. తాజాగా పార్లమెంటులో తేజస్వీ సూర్య తెలంగాణపై నోరు పారేసుకున్నారని, వెంటనే భేషరతుగా క్షమాపణ చెప్పాలని, ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే తెలంగాణ ప్రజల ఆగ్రహం బిజెపి ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కదీర్వన్, వేణుగోపాల్ రెడ్డి, ముప్పిడి మధుకర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నాగినేని సరిత, ఉపాధ్యక్షులు బల్వంత్ రెడ్డి, శాంసన్ రాజు, సదానంద్, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవానీ, నాయకులు సంకి రవీందర్, సంతోష్ యాదవ్, ధనలక్ష్మి, జమీల్, అరవింద్, నరేష్, మహేష్, సత్యనారాయణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



# పాత నేరేడ్మెట్ హిందూ సమ్మేళన ఆహ్వాన కరపత్రం ఆవిష్కరణ



**నేరేడ్మెట్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాత నేరేడ్మెట్ బస్తి హిందూ సమ్మేళనం ఆహ్వాన కరపత్రాన్ని కమిటీ సభ్యులు నేరేడ్మెట్ శివాలయంలో జరిగిన సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సమ్మేళనం ఏప్రిల్ 25 శనివారం సాయంత్రం మూడుగుల్ల వద్ద జరగనుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, పాత నేరేడ్మెట్, భగత్ సింగ్ నగర్, కేశవనగర్, న్యూ విద్యానగర్, సైనిక్ నగర్, దేవీనగర్, రామ్ బ్రహ్మ నగర్, బలరాం నగర్, సీతారాం నగర్, ఈస్ట్ శ్రీకృష్ణ నగర్, వెస్ట్ శ్రీకృష్ణ నగర్, శ్రీకృష్ణ నగర్, ఎల్బీనగర్, కృపా కాంప్లెక్స్, షిరిడి సాయి నగర్ కాలనీలలో నివసిస్తున్న హిందూ బంధువులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమ్మేళనంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, గోవింద నామాల పారాయణం, లలితా సహస్ర పారాయణం, సంగీత, కూచిపూడి, భరతనాట్యం మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

# ఎలిగేడులో టిబి పై ఎక్స్‌రే పరీక్షలు



**ఎలిగేడు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎలిగేడు మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో శుక్రవారం నిక్షయ్ శివీర్ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, ఎన్టీఈపీ టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ శివీర్‌లో టిబి పై ఎక్స్‌రే పరీక్షలు చేపట్టారు. 14 ఏళ్ల వయస్సు పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహించగా, మొత్తం 112 మందికి ఎక్స్‌రే తీసినట్లు అధికారులు తెలిపారు. ప్రజల్లో టిబి పై అవగాహన పెంపొందించడం, ముందస్తు గుర్తింపు ద్వారా చికిత్స అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నిస్సి క్రిస్టినా, సర్పంచ్ కప్పల ప్రవీణ్, టీబీ ట్రీట్మెంట్ సూపర్వైజర్ ఎస్.ఎస్. వజ్ర సురేందర్, టీబీ నోడల్ పర్సన్ నాగమణి, పంచాయతీ కార్యదర్శి అంజలి, ఎక్స్‌రే టెక్నీషియన్ రాజు, ఏఎన్ఎంలు దేవేంద్ర, శిరీష, డీఈవో భాజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు రహదారి భద్రత అవగాహన



**నాంపల్లి, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "అరైవ్--అలైవ్" కార్యక్రమంలో భాగంగా నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ దూది రాజు స్థానిక ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని, ఇన్సూరెన్స్ సకాలంలో పునరుద్ధరించుకోవాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, మద్యం సేవించి వాహనం నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. వాహనం నడిపేటప్పుడు కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లింగారెడ్డి, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# భారీగా అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



**షాద్‌నగర్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని జిల్లెడు చౌదరిగూడెం మండలంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్ఓటి పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు మండల కేంద్రంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఒక బొలెరో వాహనాన్ని పోలీసులు గుర్తించి అడ్డుకున్నారు. పేదలకు కేటాయించిన రేషన్ బియ్యాన్ని సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు నిర్ధారించారు. వెంటనే స్పందించిన ఎస్ఓటి పోలీసులు వాహనంతో పాటు బియ్యాన్ని సీజ్ చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా వెనుక ఉన్న ముఠా వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి లోతైన దర్యాప్తు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం





ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న సర్పంచ్ రమాదేవి సంపత్

**ఎలిగేడు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు ప్రబలకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్ అన్నారు. ఎలిగేడు మండలంలోని ర్యాకల్దేవుపల్లిలో స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తిరుగుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి ఇంటిలోనే సెగ్రిగేషన్ చేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని, ప్రతి కుటుంబం దీనిని అలవాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో కూడా స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమాలు నిర్వహించగా, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, ఆశావర్కర్ స్వరూప, వీవోఏ సుజాత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# దాహాన్ని తీర్చటం మానవత్వానికి మొదటి అడుగు





**అడవిదేవులపల్లి, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎండలు తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో అడవిదేవులపల్లి బస్టాండ్ సెంటర్లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ కూరాకుల చిన్నరామయ్య ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ఎస్సై శేఖర్ పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచ్ చిన్నరామయ్య మాట్లాడుతూ, వేసవి కాలంలో ప్రజలకు చల్లని నీరు అందించడం మానవత్వానికి మొదటి అడుగని, ప్రతి ఒక్కరూ ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి దుర్గయ్య, ఉప సర్పంచ్ బిళ్ళకంటి రేణుక, నరసింహారావు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ కోచింగ్



**తలకొండపల్లి, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండల నిరుద్యోగ యువతీ యువకులకు సువర్ణావకాశం లభించింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ రాష్ట్ర సిఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, అనుభవజ్ఞులైన స్టేట్ ఫేమ్ అధ్యాపక బృందం సహకారంతో ఎస్సై, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ తరగతులు ఏప్రిల్ 19 నుండి ప్రారంభం కానున్నాయి. ఈ కోచింగ్ ప్రత్యేకతల్లో రాష్ట్రస్థాయి అత్యుత్తమ అధ్యాపక బృందం, ప్రతిరోజు తొమ్మిది గంటలపాటు శిక్షణ, రోజువారీ పరీక్షలు, వారాంతర గ్రాండ్ టెస్టులు, నూతన సిలబస్‌కు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు, నాన్ మ్యాథ్స్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించడం ఉన్నాయి. తలకొండపల్లి మండల కేంద్రంలోని రెడ్డి మేస్ కాంప్లెక్స్‌లో కోచింగ్ సెంటర్ నిర్వహించనున్నట్లు యువ నాయకుడు పెరుమండ్ల సురేష్ తెలిపారు. ఉద్యోగం పొందాలనే పట్టుదలతో యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. సందేహాల కోసం 6300293551, 6303427560, 7780434424 నంబర్లను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

# డ్రైవర్లకు కంటి పరీక్షలు, సీపీఆర్ శిక్షణ



**మహబూబాబాద్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్--2026 కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని వి.ఆర్.ఎన్. గార్డెన్స్ వద్ద పాఠశాల బస్సు డ్రైవర్లకు సీపీఆర్ శిక్షణ, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డీటీఓ జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 150 మంది డ్రైవర్లు పాల్గొన్నారు. ముఖ్య అతిథి డీఎస్పీ తిరుపతి రావు ట్రాఫిక్ నిబంధనలు, డిఫెన్స్ డ్రైవింగ్ పద్ధతులు, మొబైల్ వాడకం వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాయిచరణ్ వెంకట్ రెడ్డి, మోటారు వాహన తనిఖీ అధికారులు, పాఠశాల బస్సుల సంఘం అధ్యక్షుడు యహకంబ్రం, సమన్వయకర్త మల్లారెడ్డి పాల్గొన్నారు.

## మంచాల టీపీఎస్ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



**మంచాల, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంచాల టీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు రుబియాన విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే ఈ వేడుక ఉద్దేశమని తెలిపారు. కన్వీనర్ ఝాన్సీ రాణి పాఠశాల అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమానికి ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సీఆర్పీ జగదీష్, యాదయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## యరగండ్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**మర్రిగూడ, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని వారు సూచించారు.తెలంగాణ ప్రభుత్వం మద్దతు ధరగా రూ.2399, సన్నారకం వడ్లకు రూ.2499తో పాటు రూ.500 బోనస్ ప్రకటించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, మాల్ మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి




**మర్రిగూడ, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలో టీజీఈజేఏసీ పిలుపు మేరకు ఉద్యోగ సంఘాల నాయకులు తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.ఉద్యోగ సంఘాలు పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు, డిఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర నాయకులు పోనుగోటి రవీందర్ రావు, మండల అధ్యక్షుడు రమణ, ప్రవీణ్ కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### తేజస్వీ వ్యాఖ్యలపై బేషరత్తుగా

## క్షమాపణలు చెప్పాలి -- కిచ్చెన్న



**తుక్కుగూడ, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ కిచ్చెన్న లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలకు ఆ పార్టీ బేషరత్తుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఆరు దశాబ్దాల పోరాటాన్ని తక్కువ చేసి మాట్లాడటం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని, రాష్ట్ర బీజేపీ నాయకత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. మహిళా బిల్లుతో పాటు మరో రెండు బిల్లుల వెనుక బీజేపీ కుట్ర చేస్తోందని, కాంగ్రెస్ అగ్రనాయకత్వం అన్యాయ బిల్లులను అడ్డుకుంటుందని పేర్కొన్నారు.

# మొండిగౌరెల్లి భూసేకరణలో అక్రమాలు

**- రైతుల ఆందోళన**



**యాచారం, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యాచారం మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో పారిశ్రామిక పార్క్ పేరుతో ప్రభుత్వ భూముల సేకరణలో అక్రమాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. 2013 భూసేకరణ చట్టం అమలుకాకపోవడం, పరిహారం చెల్లింపులో అన్యాయం జరగడం, రెవిన్యూ అధికారులు చట్టాలను ఉల్లంఘిస్తున్నారని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సర్వే నంబర్లు 19, 68, 127లో మొత్తం 677.29 ఎకరాల భూమి సేకరణకు గత సంవత్సరం నోటిఫికేషన్ ప్రకటించగా, ఇటీవల పరిహారం మొత్తాన్ని 30 లక్షలుగా నిర్ణయించారు. అయితే, ఈ ప్రక్రియలో రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మధ్య కోట్ల రూపాయలు చేతులు మారుతున్నట్లు గ్రామస్థులలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అదనంగా, భూమికి సంబంధం లేని వ్యక్తులు తమ పేర్లపై భూములను నమోదు చేసుకోవడం రైతుల ఆందోళనకు కారణమైంది.రైతులకు న్యాయం జరగాలని, నిజమైన భూస్వాములను గుర్తించి వారికి సరైన పరిహారం అందించాలని తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోడుకొండ్ల ప్రవీణ్ డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం కొనసాగితే త్వరలోనే నిరాహార దీక్ష చేపడతానని ఆయన హెచ్చరించారు.

## తేజస్వి సూర్య వ్యాఖ్యలపై నల్లగొండలో కాంగ్రెస్ నేతల నిరసన



**నల్లగొండ, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కర్ణాటక ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణను పాకిస్తాన్ విభజనతో పోల్చిన వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నేతలు నల్లగొండలో క్లాక్ టవర్ వద్ద దిష్టిబొమ్మ దహనం చేశారు.డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేత ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో నేతలు బీజేపీపై వ్యతిరేక నినాదాలు చేశారు. తెలంగాణ అమరుల త్యాగాలను అవహేళన చేస్తే ప్రజలు బీజేపీని భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు.మహిళా బిల్లు, డిలిమిటేషన్ అంశాలపై బీజేపీ తప్పుడు ఆరోపణలు చేస్తోందని విమర్శిస్తూ, తేజస్వి సూర్య వ్యాఖ్యలపై ప్రధాని మోడీ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎండి ముంతాజ్ అలీ, పేరిక వెంకటేశ్వర్లు, నోముల జనార్ధన్, కోమటిరెడ్డి అంజిరెడ్డి, వేముల గోపీనాథ్, అంబల హరీష్, పల్లా రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## తిప్పర్తిలో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్



**తిప్పర్తి, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తిప్పర్తి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు సందర్శించి రైతులతో మాట్లాడారు.రైతులు నెలరోజులుగా ధాన్యం మార్కెట్‌లో నిల్వ ఉన్నా కొనుగోలు జరగకపోవడం, మిల్లర్లు కట్‌లు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని వారు తెలిపారు. వెంటనే స్థానిక మిల్లులకు ట్యాగింగ్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని, లేకపోతే రేపు అద్దంకి--నార్కట్పల్లి హైవే దిగ్బంధన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం, బిఆర్ఎస్ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నిరసన




**తిప్పర్తి, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** టీజేఏసీ పిలుపు మేరకు మండల ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ఉపాధ్యాయ నాయకులు పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో నామిరెడ్డి మహేందర్ రెడ్డి, గుర్రం రవి, సదానందం, అదిమల్ల శ్రీనివాస్, యం. లింగమల్లు తదితరులు పాల్గొన్నారు.

## అస్సాం ముఖ్యమంత్రిపై మాల మానాడు నాయకుల ఫిర్యాదు



**తాడూరు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ దళిత నాయకుడు, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేపై అస్సాం ముఖ్యమంత్రి హిమాంత్ బీస్వా శర్మ చేసిన వ్యాఖ్యలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని మాల మానాడు నాయకులు తీవ్రంగా ఖండించారు.ఖర్గేను దాడి చేసి చంపేస్తామని చేసిన వ్యాఖ్యలు భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని, ఆయనపై ఎస్సీ--ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం మాల మానాడు నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైకి ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి, నాయకులు సంగమొల్ల శీను, శేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణను దేశ విభజనతో పోల్చడం సిగ్గుచేటు -- జంగిలి యాదగిరి



**వెల్దండ, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాలు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దీర్ఘ పోరాటం ఫలితంగా ఏర్పడిందని, దాన్ని దేశ విభజనతో పోల్చడం సిగ్గుచేటు అని తీవ్రంగా ఖండించారు.బిజెపి ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచాయని, వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి పరిణామాలు పునరావృతమైతే ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని టీజేఏసీ నాయకుల నిరసన




**నల్లగొండ, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** టీజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టర్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.జేఏసీ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలోని 15.25 లక్షల ఉద్యోగుల 206 సంఘాలు ఏకమై నాలుగు ప్రధాన సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నాయని పేర్కొన్నారు. 2వ పిఆర్సి నివేదికను జూన్ 2లోపు అమలు చేయాలని, రూ.13,000 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, ఉద్యోగుల--పెన్షనర్ల ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, కాంట్రిబ్యూషన్ పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ స్కీం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సుంకరి భిక్షం గౌడ్, మారం అంజిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జె. శేఖర్ రెడ్డి, యాకుబ్ నాయక్, నర్రా శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది



**హాలియా, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను మాట్లాడుతూ, హాలియా సర్కిల్‌లో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా ఆబ్కారీ అధికారులు ముడుపుల కోసం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బెల్ట్‌షాపుల్లో అధిక ధరలు వసూలు చేస్తున్నారని, రాత్రివేళల్లో మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని, పేదలు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. పర్మిట్ రూమ్లలో కనీస వసతులు లేకపోవడం, అనుమతి లేని రూమ్లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో కలెక్టర్, ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్‌ను కలిసి పూర్తి వివరాలు అందజేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో దైద శ్రీను, దొంతల నాగార్జున, దోరేపల్లి మల్లయ్య, మేకల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**ఆమనగల్లు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు సంకటోనిపల్లి కి చెందిన గద్ద సాయిలు అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న అ వార్డు కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్ శుక్రవారం మృతుడి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. తనవంతు సహాయంగా 2000 రూపాయలు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఉప్పల వెంకటేష్ సహకారంతో 3000 రూపాయలు సమకూర్చి మృతుడి కుటుంబానికి 5000 రూపాయలను అందజేశారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ కమటం రాధామ్మ వెంకటయ్య, సింగల్ విండో డైరెక్టర్ శ్రీపాల్ నాయకులు రామలింగం, మల్లేష్, నిరంజన్ తదితరులు ఉన్నారు.

## పరామర్శ, ఆర్థిక సహాయం



**ఆమనగల్లు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తాండకి చెందిన మూడావత్ శ్రీను నాయక్ గురువారం మృతి చెందాడు. తాండ మాజీ సర్పంచ్ అంబర్ సింగ్ శుక్రవారం మృతుడు శ్రీను నాయక్ ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. తనవంతు సహాయంగా కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. అయన వెంట ఉప-సర్పంచ్ విజయ్ రాథోడ్, వార్డు మెంబర్ సీతారాం, కవిత మణిపాల్, నాయకులు రఘు, హరిలాల్, పురుషోత్తం, మేగ్య, మల్లేష్, సొమ్లా రవి, శివ, తులసి రామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



**ఎలిగేడు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎలిగేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్ నిస్సి క్రిస్టీనా ఆటో డ్రైవర్లకు గుండెపోటు సమయంలో సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మధుకర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మధుకర్, ఏఎస్సైలు శ్రీనివాస్, బాస్కర్, వైద్య సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# చల్లని ప్రమాదం

### కొబ్బరినీరు తాగడమే మేలు

ఎండవేడిమికి ఉపశమనం కోసం కొబ్బరినీరు తాగడమే మేలు. ఐస్ ఉన్న పళ్ల రసాలు తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. ఒకవేళ తీసుకుంటే ఐస్ వాడొద్దు. వీటివల్ల అతిసారం, పేగు సంబంధిత వ్యాధులు, గొంతునొప్పి వంటివ్యాధులు వస్తాయి. జాగ్రత్తగా ఉండాలి.

- డాక్టర్ మైమున బేగం

### ఐస్ తీసుకోవద్దు

ఎండకాలంలో దాహం వేస్తే జ్యూస్ తాగాలని అనిపించినా.. ఐస్ మాత్రం వేసుకోవద్దు. ఏ వాటర్ తో చేస్తున్నారో తెలియదు. ఊక పెట్టడంతో అవి శుభ్రత ఉండదు. ప్రజలు గ్రహించాలి. దీంతో వివిధ రకాల వ్యాధులు సైతం వస్తుంటాయి. జాగ్రత్తగా ఉండాలి.

- డాక్టర్ నాగరాజు

- నిప్పులు కురిపిస్తున్న భానుడు
- శీతల పానీయాల వైపు ప్రజలు
- ప్రమాదకరంగా మారుతున్న ఐస్
- అనారోగ్యం పాలవుతున్న వైనం

**ఆమనగల్లు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు కేంద్రంలో నిత్యం వందలాది మంది వివిధ పనుల నిమిత్తం ఇక్కడకు వస్తుంటారు. ఎండలు ముదరడంతో చల్లని పానీయాల వైపు మళ్లుతున్నారు. మరికొందరు జ్యూస్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణ కేంద్రంలో ఎక్కడ బడితే అక్కడ జ్యూస్ సెంటర్లు వెలిశాయి. ఇంత వరకు బాగానే ఉన్నా.. అందులో వినియోగిస్తున్న ఐస్ మాత్రం ఎక్కడి నుంచి తెస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఐస్ ను జ్యూస్ లో కలిపి ఇవ్వడంతో ప్రజలు చల్లగా తాగేస్తున్నారు. అయితే వాటితో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు.

**తాగితే అనర్థమే..**
మార్చి నుంచే ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు



భయపడుతున్నారు. పనులు నిమిత్తం పట్టణ కేంద్రానికి వస్తున్న ప్రజలు శీతల పానీయాలు తాగుతున్నారు. రోడ్డుపైనే చెరుకు రసాలు, పండ్ల రసాలు, జ్యూస్, కూల్ డ్రింక్స్ విక్రయిస్తుండంతో దాహార్తి తీర్చుకునేందుకు ప్రజలు వాటి వైపు మళ్లుతున్నారు.

**ఐస్ ముక్కలతో పరేషాన్**
చల్లదనం కోసం చెరుకు రసం, జ్యూస్ లో ఐస్ ముక్కలు కలిపి ఇస్తుంటారు. కానీ ఆ ఐస్ తాగితే గొంతునొప్పి వంటి సమస్యలకు కారణమవుతున్నాయి. సాధారణంగా ఐస్ ను రెండు విధాలుగా తయారుచేస్తుంటారు. ఒకటి పారిశ్రామిక అవసరాలకు.. మరొకటి మాంసం, చేపలు, పండ్లు, ఔషధాల నిల్వ కోసం వినియోగిస్తుంటారు. ఐస్ ను ఏ నీటితో నైనా తయారు చేయొచ్చు. పండ్ల రసాలకు వినియోగించే ఐస్ తయారీకి మాత్రం శుభ్రమైన నీటిని వాడాల్సి ఉంటుంది. పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలి. ఈ ఐస్ తయారీకి కాస్త రిస్క్ ఎక్కువ. ఈ క్రమంలో కొందరు నాణ్యతలేని ఐస్ ముక్కలను తయారీ చేస్తున్నారు. వీటితో గొంతునొప్పి, జ్వరం, అస్తమా వంటి వ్యాధులు వస్తుంటాయి. ముఖ్యంగా శీతల పానియాలు తాగు వారు ఐస్ ముక్కలు వేసుకోకుంటేనే మంచిదని వైద్యులు పేర్కొంటున్నారు. నాణ్యతలేని ఐస్ ను గుర్తించడం కష్టమే అయినప్పటికీ ఏ ఐస్ వేస్తారో తెలియదు.

# తేజస్వి సూర్య వ్యాఖ్యలపై మండిపడ్డ యూత్ కాంగ్రెస్

- కడ్తాలలో దిష్టిబొమ్మ దహనం
- తెలంగాణ గౌరవాన్ని కించపరిస్తే సహించం
- తేజస్వి సూర్య వెంటనే క్షమాపణ చెప్పాలి
- యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు షాబుద్దీన్

**ఆమనగల్లు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని కించపరిచే విధంగా పార్లమెంట్‌లో వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బోసు రవి ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షులు షాబుద్దీన్, మండల అధ్యక్షులు బోస్ రవి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అనేది ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్నదని, అలాంటి పవిత్రమైన ఉద్యమాన్ని అవమానించే విధంగా



మాట్లాడటం అసహనీయమని తెలిపారు. విద్యార్థుల పోరాటంతో, అమరుల త్యాగఫలంతో, కళాకారుల గొంతుకతో, సామాజికవేత్తల మార్గదర్శనంతో నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన తెలంగాణ తల్లి సోనియా గాంధీని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన తేజస్వి సూర్య వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని అదే పార్లమెంటులో తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తన పార్లమెంటు సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు సమర్థిస్తూ వత్తాసు పలికిన బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ప్రజలు క్షమించరని అన్నారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గం ఉపాధ్యక్షులు ఇమ్రాన్ బాబా, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, మండల సోషల్ మీడియా కన్వీనర్ కర్రోళ్ళ రమేష్, వార్డ్ సభ్యులు భాను కిరణ్, విజయరాథోడ్, నాయకులు ఎర్రోళ్ళ శ్రీకాంత్, గంజి చంద్రశేఖర్, గండికోట మహేందర్, నీలం శ్రీకాంత్, ప్రవీణ్ గౌడ్, లక్ష్మణ్, సందీప్, శివ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

### ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

**దేవరకొండ ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
కొండమల్లేపల్లిమండల పరిధిలోని కోల్ ముంతల్ పహాడ్ గేట్ వద్ద శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా అక్రమ రేషన్ బియ్యం పట్టుబడింది. కొండమల్లేపల్లి ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా, అనుమానాస్పదంగా వస్తున్న ఒక టవేరా వాహనాన్ని (టిఎస్ 12 ఈల్2982) ఆపి సోదా చేశారు. ఈ సోదాలో వాహనంలో తరలిస్తున్న 8 క్వింటాళ్ల బరువు గల 18 రేషన్ బియ్యం బస్తాలను పోలీసులు గుర్తించారు. వాహనంలో ఉన్న



వ్యక్తులను విచారించగా, వారు కడ్తల్ మండలం పల్లి చెల్క తండాకు చెందిన నేనవత్ గోపాల్ (తండ్రి: బిచ్చా), మరియు జర్పుల కుమార్ (తండ్రి: జానీ, 23 సం।) గా నిర్ధారణ అయ్యింది. నిందితులు దేవరకొండ మరియు కొండమల్లేపల్లి మండలాల్లోని చుట్టుపక్కల గ్రామాల నుండి తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు బియ్యాన్ని సేకరించినట్లు ఒప్పుకున్నారు. సేకరించిన ఈ బియ్యాన్ని ఎక్కువ ధరకు విక్రయించేందుకు చారకొండకు తరలిస్తుండగా పట్టుబడినట్లు వారు విచారణలో వెల్లడించారు. పోలీసులు బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయించినా లేదా కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# తెలంగాణ గౌరవాన్ని కించపరిస్తే సహించం

**- సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్**



**ఆమనగల్లు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పార్లమెంటులో తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్ తీవ్రంగా మండిపడ్డారు. ఇది అమరుల త్యాగాలను అవమానించడమేనని ఆక్షేపించారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్ల పోరాటం, తెలంగాణ బిడ్డల బలిదానాలు, ఉద్యమాన్ని తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ విషం చిమ్మడం మానలేదని, అందుకు నిదర్శనమే కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య అనుచిత వ్యాఖ్యలని విమర్శించారు. త్యాగాలు, సుదీర్ఘ పోరాటంతో సిద్ధించిన తెలంగాణను తక్కువ చేసి మాట్లాడటం తగదని, ఈ వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ లు మౌనం వహించడం విచారకరమన్నారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, వెంటనే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

# తేజస్వి సూర్య వ్యాఖ్యల్ని ఖండిస్తున్నాం

**- బీఆర్ఎస్వి నాయకులు వర్షిత్**




**ఆమనగల్లు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పార్లమెంటులో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు మీసాల వర్షిత్ అన్నారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్ల పోరాటం, తెలంగాణ బిడ్డల బలిదానాలు, ఉద్యమాన్ని తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ విషం చిమ్మడం మానలేదని, అందుకు నిదర్శనమే కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య అనుచిత వ్యాఖ్యలని విమర్శించారు. త్యాగాలు, సుదీర్ఘ పోరాటంతో సిద్ధించిన తెలంగాణను తక్కువ చేసి మాట్లాడటం తగదని, ఈ వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ లు మౌనం వహించడం విచారకరమన్నారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, వెంటనే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

# యాదిలాల్ ను సత్కరించిన గుర్రం కేశవులు



**ఆమనగల్లు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా రెండవసారి ఎన్నికైన అండేకార్ యాదిలాల్ ను ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు ఘనంగా సత్కరించారు. ఆమనగల్ పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు అండేకార్ యాదిలాలను గుర్రం కేశవులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు రమేష్, న్యాయవాదులు గణేష్ శిరీష్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అమృత్ పథకంలో అక్రమాలు ఆరోపణలు



**కరీంనగర్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ నగరంలో అమృత్ పథకం పనుల పేరుతో భారీ అక్రమాలు జరుగుతున్నాయని బిఆర్ఎస్ కార్పొరేటర్, మాజీ మేయర్ రవీందర్ సింగ్ ఆరోపించారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే మిషన్ భగీరథ పైప్‌లైన్లు ఉన్న ప్రదేశాల్లోనే మళ్లీ అమృత్ పథకం కింద పైపులు వేస్తున్నట్లు చూపిస్తూ ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. కేవలం బిల్లులు కాజేయడానికే నామమాత్రంగా తవ్వకాలు జరుపుతున్నారని మండిపడ్డారు. జిల్లాలో సుమారు 3 లక్షల 76 వేల పైప్‌లైన్లు ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్లుగా ముఖ్యమంత్రి బంధువులు ఉండటం వల్లే అధికారులు కూడా నోరు మెదపడం లేదని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

# పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని టీఎన్జీవో నిరసన



**దేవరకొండ, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** టీఈజేఏసీ ఆదేశాల మేరకు దేవరకొండ ఆర్డీవో కార్యాలయం ముందు టీఎన్జీవో నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉద్యోగ--ఉపాధ్యాయ సంఘాలు పిఆర్సి అమలు, పెండింగ్ బిల్లుల విడుదల, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు, మిగతా 62 డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షురాలు డి. రుణాదేవి, సెక్రటరీ జంగయ్య, ట్రెజరర్ నాగరాజు, అంగన్వాడి, రెవెన్యూ, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదానం మహాదానం

**- వాసవి మిత్రమండలి**





**మేడ్చల్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమావాస్య సందర్భంగా వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ఎ రోడ్ వద్ద అన్నప్రసాదం వితరణ చేశారు. జిల్లా అధ్యక్షుడు పెద్ది నాగరాజు గుప్త మాట్లాడుతూ అన్నదానం పవిత్రమైనదని, ఆకలిని తీర్చే మహాదానం సమాజంలో ప్రేమ, సోదరభావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పేద వృద్ధురాళ్లకు ఒక్కొక్కరికి రూ.1000 పించను అందజేశారు. కార్యక్రమంలో రెబెల్లి శ్రీనివాస్ గుప్త, రాముని తిరుమలేష్ గుప్తా, గంప కృష్ణ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ డిఏలు విడుదల

**- పిఆర్సి అమలు చెయ్యాలని డిమాండ్**



**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** :తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీజీ ఈ జేఏసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లాలో అన్ని మండలాల్లో పెద్ద ఎత్తున వినతి పత్రాల సమర్పణ జరిగింది. కరీంనగర్ రూరల్ మరియు అర్బన్ తహసీల్దార్లు లక్ష్మీనరసింహారావు, నరేందర్‌లకు టీజీ ఈ జేఏసి జిల్లా ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు వినతి పత్రాలు సమర్పించారు. జేఏసి నాయకులు మాట్లాడుతూ జూన్ 2వ తేదీ నాటికి పిఆర్సి అమలు చేయాలని, రిటైర్ అయిన ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తక్షణమే అమల్లోకి తెచ్చి హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2004 సెప్టెంబర్ 1కి ముందు నియామకమైన ఉద్యోగులకు ఓపిఎస్ అమలు చేయాలని కోరారు. పెండింగ్ డిఏలను విడుదల చేయాలని, 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, సాధారణ బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీ ఈ జేఏసి నాయకులు అన్నమనేని తిరుపతిరావు, పూదరి రాజు, కనకరాజు, అరవింద్, స్వాతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, జిపిఓ సంఘ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# తేజస్వి సూర్య వెంటనే క్షమాపణ చెప్పాలి

**- ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్**



**ఆమనగల్లు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణను ఉద్దేశించి బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్ అన్నారు. శుక్రవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల త్యాగాలను అవమానించేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని, రాష్ట్రం ఎన్నో ఏళ్ల పోరాట ఫలితమని, ప్రజల భావోద్వేగాలను గౌరవించి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, వెంటనే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

# బాటసారులకు మజ్జిగ పంపిణీ



**ఆమనగల్లు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎండలు మండుతున్నాయి. జనాలు అనేక పనులపై బయటకు వెళ తుంటారు. బాటసారుల దాహం.. దప్పిక తీర్చేందుకు ఆమనగల్లు పట్టణ కేంద్రంలో అప్నా ఆమనగల్లు టీం ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా రహదారి వెంట ప్రయాణించే ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేశామన్నారు. ఎండాకాలంలో జనాల దాహాన్ని తీర్చేందుకు మజ్జిగను పంపిణీ చేశామని ఆమనగల్లు టీం సభ్యులు తెలిపారు. మంచినీరు కంటే మజ్జిగను అందించడం వల్ల శరీరానికి కావలసిన పోషకాలు .. ఇతర లవణాలు అందుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మూసా, శ్రీకాంత్, సాయి, చంటి, దినేష్, నితిన్, అహ్మద్ తదితరులు ఉన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ**



**ఆమనగల్లు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అచ్చంపేట ఎమ్మెల్యే, నాగర్ కర్నూల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం కడ్తాల్ పట్టణ కేంద్రంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు బిచ్య నాయక్ లను శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ కుమారుడి వివాహ వేడుక పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణను ఉద్దేశించి బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల త్యాగాలను అవమానించేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని, రాష్ట్రం ఎన్నో ఏళ్ల పోరాట ఫలితమని, ప్రజల భావోద్వేగాలను గౌరవించి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, వెంటనే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, రామచంద్ర నాయక్ తదితరులు ఉన్నారు.

## భగత్ నగర్ బస్తీలో హిందూ సమ్మేళన బైక్ ర్యాలీ



**కరీంనగర్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భగత్ నగర్ బస్తీ ఆధ్వర్యంలో ఈనెల 18న జరగనున్న హిందూ సమ్మేళనం విజయవంతం కావాలని కోరుతూ ఈరోజు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరై పచ్చజెండా ఊపి ప్రారంభించారు. బస్తీలోని ప్రధాన వీధుల గుండా జై శ్రీరామ్ నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. హిందూ సమ్మేళన సమితి ప్రతినిధులు, బస్తీ ప్రముఖులు, యువత, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహాన్ని ప్రదర్శించారు.

# వైభవంగా పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో చండీయాగం



**కరీంనగర్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వసంత రుతువులో చైత్రమాస అమావాస్య శుక్రవారం సందర్భంగా దేవుళ్లపురి పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో వైభవంగా నవ చండీయాగం జరిగింది. ప్రముఖ జ్యోతిష్య, వాస్తు, ఆగమ శాస్త్ర పండితుడు నమిలకొండ రమణాచార్య స్వామి ఆధ్వర్యంలో యజ్ఞశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు.నూతన తెలుగు సంవత్సరం శ్రీ పరాభవ నామ సంవత్సరం చైత్రమాస అమావాస్య రోజున లోక కళ్యాణార్థం, సకల జనావళి సౌభాగ్యం కోసం ఈ యాగం నిర్వహించామని పండితులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోపీశర్మ, శివరామకృష్ణ, నమిలకొండ రామకృష్ణ, మధుసూదనాచార్యులు, రాఘవాచార్యులు, వినయ్ స్వామి, వివేక్ స్వామి, విష్ణుమాచార్యులు, ఆకాశ్ స్వామి, లక్ష్మీనాచారి స్వామి తదితర పండితులు పాల్గొన్నారు. వెల్మ సంఘం అధ్యక్షుడు నీలగిరి హనుమంతరావు, బిఆర్ఎస్ నాయకుడు ఓరుగంటి రమణారావు, ఆలయ అర్చకులు రామాచారి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ చండీయాగం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తూ, ఆలయ వాతావరణాన్ని వైభవోపేతంగా మార్చింది.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన



**కరీంనగర్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కోఆర్డినేటర్ పి. స్వరూప పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 500 రిఫరెన్స్ పుస్తకాలను ప్రదర్శించారు.విద్యార్థుల స్టడీ ప్రాజెక్టులు, పరిశోధన పనులకు నాణ్యమైన విద్యా వనరులను అందించడమే ఈ ప్రదర్శన ఉద్దేశ్యమని యాజమాన్యం తెలిపింది. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులలో విద్యా భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు సమ్మె విరమణ



**మంథని, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఆర్టిజన్, అన్‌మాండ్ కార్మికులు 10 రోజులుగా కొనసాగించిన నిరవధిక సమ్మెను విరమించారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా జేఏసి కన్వీనర్ తుల నాగరాజు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర జేఏసి నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారి న్యాయమైన హక్కులను నెరవేర్చుతామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమణకు అంగీకరించారు. శనివారం నుండి ఎలాంటి వ్రాతపూర్వక ఒప్పందాలు లేకుండా సర్కిల్, డివిజనల్, సెక్షన్ ఇంజనీర్లు ఆర్టిజన్, అన్‌మాండ్ కార్మికులను డ్యూటీలో జాయిన్ చేసుకోవాలని జేఏసి నేతలు అధికారులను కోరారు. తమ హక్కుల సాధన కోసం 10 రోజులుగా సమ్మెకు మద్దతు తెలిపిన ట్రేడ్ యూనియన్ల నాయకులకు, ఆర్థిక సహాయం అందించిన అధికారులకు, వినియోగదారులకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ నిర్ణయంతో విద్యుత్ సేవలు తిరిగి సాధారణ స్థితికి చేరనున్నాయి.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు ఖండిస్తున్న బుర్ర శ్రీనివాస్ గౌడ్

**హుస్నాబాద్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, అవి తీవ్రంగా ఖండనీయం అని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు.హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన, తెలంగాణ చరిత్రపై అవగాహన లేకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్--పాకిస్తాన్ విభజనతో పోల్చడం పూర్తిగా అవివేకమని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు సాగిన ప్రజా



పోరాటం, అనేక మంది చేసిన ఆత్మబలిదానాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఇది భారత రాజ్యాంగం ప్రకారం పార్లమెంట్ ఆమోదంతో ఏర్పడిన రాష్ట్రమని గుర్తుచేశారు.తెలంగాణపై ఇలాంటి వ్యాఖ్యలు వచ్చినప్పటికీ, రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు స్పందించకపోవడం బాధాకరమని ఆయన విమర్శించారు. ముఖ్యంగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మౌనం వహించడం తగదని అన్నారు.ఎంపీ తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బుర్ర శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.

# శ్రీ వాసవి అన్నపూర్ణ సేవా సమితి సమక్షంలో అన్నప్రసాద వితరణ



**గంగాధర, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో శ్రీ వాసవి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. సమితి సభ్యులంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.భక్తుల సేవలో భాగంగా నిర్వహించిన ఈ అన్నప్రసాద వితరణ స్థానిక ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది.

# రామవరం గ్రామంలో ప్రభుత్వ భూములపై ఎమ్మార్వో తనిఖీ




**హుస్నాబాద్ , ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అక్కన్నపేట మండల పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మండల తహసీల్దార్ మధుసూదన్ రామవరం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని ఐకెపి కేంద్రాన్ని సమగ్రంగా తనిఖీ చేసి, రికార్డుల పరిశీలనలో సర్వే నంబర్ 476లో 5 ఎకరాలు 33 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించారు.ఈ భూమిని ఐకెపి కేంద్రానికి కేటాయించాలని గ్రామ సర్పంచ్ శ్రీశైలం విజ్ఞప్తి చేశారు. ఎమ్మార్వో మధుసూదన్ సంబంధిత భూములపై పూర్తి స్థాయి ధృవీకరణ చేపట్టి, ప్రభుత్వ నియమావళి ప్రకారం పరిరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అక్రమ ఆక్రమణలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, స్థానిక అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో డిటి లక్ష్మీనారాయణ, ఆర్ఐ జావేద్ పాషా, జీపీఓ భూపాల్, గ్రామ కార్యదర్శి, సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ లింగాల కనకయ్యతో పాటు ఇతర స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# అగ్నిమాపక సిబ్బంది సేవలు ఎనలేనివి



**హుస్నాబాద్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలోని ఫైర్ స్టేషన్‌లో వాసవి క్లబ్ గ్రేటర్ హుస్నాబాద్ మరియు వనిత క్లబ్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బందికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాల నివారణలో ఫైర్ సిబ్బంది తమ ప్రాణాలను లెక్క చేయకుండా సేవలు అందిస్తూ ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షిస్తున్నారని కొనియాడారు. వారి సేవలు సమాజానికి ఎంతో మేలుచేస్తున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ ఎస్ఐ సిహెచ్ రాజయ్య, వాసవి క్లబ్ అధ్యక్షుడు వనపర్తి వంశీ, ప్రధాన కార్యదర్శి కంభంపాటి సందీప్, కోశాధికారి గౌరిశెట్టి రవితేజ, వనిత క్లబ్ అధ్యక్షురాలు చొల్లేటి లత, కోశాధికారి మల్యాల రాధికతో పాటు ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎఅప్సెట్ ఆన్లైన్ పరీక్షలు



**తిమ్మాపూర్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మోడల్ ఎఅప్సెట్ ఆన్లైన్ పరీక్షలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఏప్రిల్ 25 వరకు వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతాయి.ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని, ఈ మోడల్ పరీక్షలు వారికి ప్రధాన ఎఅప్సెట్ పరీక్షకు ముందు ప్రాక్టీస్ అవుతాయని తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు అలవాటు కావడానికి ఇది ఉపయోగపడుతుందని అన్నారు.ప్రతి సంవత్సరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎఅప్సెట్ పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నం జరుగుతుందని, విద్యార్థుల హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అసంపల్లి వినయ్ సాగర్, కమిటీ సభ్యులు గన్నారపు రాకేష్, రక్షాక్, అంబాల సందేశ్, అక్షయ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.ఈ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అందుబాటులో ఉంటాయని, వారు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సూచించారు.

# ప్రైవేట్ విద్యాసంస్థలపై ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షుడి విమర్శలు

**కరీంనగర్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ముందస్తు అడ్మిషన్లు చేపట్టి, అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ తీవ్రంగా విమర్శించారు.జూన్‌లో కొత్త విద్యా సంవత్సరం



ప్రారంభం కావాల్సి ఉండగా, అనేక పాఠశాలలు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లోనే అడ్మిషన్లు పూర్తి చేశాయని ఆయన తెలిపారు. తల్లిదండ్రులను సీట్లు దొరకవని భయపెట్టి, పుస్తకాలు, యూనిఫాంల కోసం ముందస్తుగా లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.విద్యా హక్కు చట్టం ప్రకారం నిరుపేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు ఇవ్వాల్సి ఉన్నా, ప్రైవేట్ పాఠశాలలు వాటిని అమలు చేయకుండా సాధారణ అడ్మిషన్లపైనే దృష్టి పెడుతున్నాయని అన్నారు. గుర్తింపు లేని పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం రాజకీయ పలుకుబడితో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తోందని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని పాఠశాలలను సీజ్ చేసి, ప్రజలకు తెలిసేటట్టు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, లేకుంటే పార్టీ తరపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# వీధి దీపాల సమస్యకు చెక్ పెట్టిన అధికారులు




**కరీంనగర్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కట్టరాంపూర్ ప్రాంతంలోని దుర్గా భవాని నగర్ గిద్దె పెరుమాండ్ల గుడి (జిపి గ్రౌండ్)కు వెళ్లే దారిలో స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను నీలగిరి ఎక్స్‌ప్రెస్ పత్రిక ఏప్రిల్ 13న కథనం ద్వారా వెలుగులోకి తెచ్చింది.సమస్యపై వెంటనే స్పందించిన అధికారులు మరమ్మత్తులు జరిపి, సాయంత్రం వెలుగులు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో చీకట్లోనూ వీధి దీపాలు వెలిగిపోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.డివిజన్ ప్రజలు అధికారులకు, నీలగిరి ఎక్స్‌ప్రెస్ పత్రిక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# నీలగిరి ఎక్స్ ప్రెస్ చొరవతో పైప్‌లైన్ లీకేజీ మరమ్మత్తులు పూర్తి




**కరీంనగర్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కట్టరాంపూర్‌లోని మానేరు డాం రహదారిలో నాగన్న చౌరస్తా వద్ద మంచినీటి పైప్‌లైన్ లీకేజీ సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించారు. ఏప్రిల్ 13న నీలగిరి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన కథనం ఆధారంగా మున్సిపల్ కార్పొరేటర్, అధికారులు తక్షణ చర్యలు తీసుకుని మరమ్మత్తులు పూర్తి చేశారు.

# పరిశుభ్రంగా మారిన తిలక్‌నగర్ చౌరస్తా




**కరీంనగర్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తిలక్‌నగర్ చౌరస్తా జెండా గద్దె వద్ద చెత్త పేరుకుపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.ఏప్రిల్ 15న నీలగిరి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన కథనం ఆధారంగా అధికారులు వెంటనే స్పందించి ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు. త్వరలో జెండా గద్దె చుట్టూ కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల
# సమస్యలపై జేఏసీ నిరసనలు

**కరీంనగర్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రాలు సమర్పిస్తూ, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మానకొండూర్‌లో తహసీల్దార్ కార్యాలయానికి వినతి పత్రం సమర్పించిన ఉద్యోగులు పీఆర్సీని జూన్ 2వ తేదీ నాటికి అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలు, ఎంఎల్సి ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కూడా కోరారు. గంగాధర మండలంలోని రామడుగులో ఎస్టీటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీని తక్షణమే ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏకకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో ఈ కార్యక్రమం జరిగింది. కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్




రెడ్డి మాట్లాడుతూ, డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు, మెడికల్ బిల్లులు, జిపిఎఫ్ వంటి రాజ్యాంగబద్ధ హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 01/07/2023 నుండి అమలు కావాల్సిన పీఆర్సీ ఇప్పటికీ అమలు కాకపోవడం, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం ఉద్యోగులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని తెలిపారు. అలాగే ఆయన భావోద్వేగంగా మాట్లాడుతూ, మా రక్తపు చుక్కలను చెమట చుక్కలుగా మార్చి ప్రతి నెల పైసా పైసా దాచుకుంటే... ఆ డబ్బులు మా పిల్లల పెళ్లిళ్లకు, ఇల్లు నిర్మాణానికి, అప్పులు తీర్చడానికి, ఆరోగ్య అవసరాలకు ఉపయోగపడాలి. కానీ ఈరోజు ఆ డబ్బుల కోసం మేమే రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. ఇవి ఎవరి దయాదాక్షిణ్యాలు కాదు మాకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులు అని వేదన వ్యక్తం చేశారు. ఓపిఎస్ పునరుద్ధరణ, హెల్త్ కార్డు అమలు, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వంటి అంశాల్లో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, రెవెన్యూ సిబ్బంది, జిపిఓలు, గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మండల నాయకురాలు కొలిపాక గౌతమి
# సమక్షంలో జాగృతిలో భారీ చేరికలు

**మనకొండూర్--వీణవంక, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మనకొండూర్ మండల జాగృతి నాయకురాలు కొలిపాక గౌతమి ఆధ్వర్యంలో అన్నారం గ్రామానికి చెందిన పలువురు మహిళలు, వీణవంక మండలానికి చెందిన సీనియర్ నాయకులు ధర్మరెడ్డిలు తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఈనెల 25న కవిత నాయకత్వంలో ఆవిర్భవించనున్న కొత్త రాజకీయ పార్టీ తెలంగాణ భవిష్యత్తును మార్చే శక్తిగా నిలుస్తుందని, మహిళలు గ్రామాల వారీగా ముందుకు వస్తున్నారని తెలిపారు. కవిత ఒక్కరే ఈ ప్రభుత్వంపై పోరాటం చేస్తోందని, ఇతర నేతలు పరస్పరం రక్షణగా ఉన్నారని



విమర్శించారు.కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్--పాకిస్తాన్ విభజనతో పోల్చిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండనీయం అని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటాన్ని కించపరిచేలా చేసిన ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర బీజేపీ ఎంపీలు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, బసవేణి రాజేందర్, బత్తిని సాగర్ కసుంబా, మంజుల, అలాగే రంగపేట సునీత, రొడ్డ లత, రొడ్డ లలిత, బత్తిల మనోహర్, దాసరి లత, కనకమ్మ, సంధ్య, ఆరెల్లి ఈశ్వరమ్మ, ఆరెల్లి కనుకలక్ష్మి, ఇప్పనపల్లి లక్ష్మి, ఇప్పనపల్లి ఇంద్ర, కొలిపాక కనుకలక్ష్మి, దాసరి శంకరలింగం తదితరులు పాల్గొన్నారు.

# వానకాలం పంటల సాగుకు సన్నద్ధం కావాలి

**కరీంనగర్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ ఏడిఏ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వానకాలం (ఖరీఫ్) పంటల సాగుకు సంబంధించి సమీక్ష సమావేశం జరిగింది. రాబోయే సీజన్‌కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ముందుగానే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేయడం తప్పనిసరి అని, భవిష్యత్తులో అన్ని సంక్షేమ పథకాలు, సబ్సిడీలు దీనికి అనుసంధానమై ఉంటాయని స్పష్టం చేశారు. ఏఈవోలు గ్రామస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని 100శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.డిజిటల్ క్రాప్ బుకింగ్ (ఈక్రాప్) సమయానికి పూర్తి చేయాలని, ప్రతి రైతు పంట వివరాలు ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా నష్టపరిహారం, ఇతర ప్రయోజనాలు సులభంగా అందుతాయని తెలిపారు. పంటల మార్పిడిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ముఖ్యంగా పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు సాగు చేయాలని



రైతులకు విజ్ఞప్తి చేశారు.ప్రతి రెవెన్యూ గ్రామంలో ముగ్గురు సాయిల్ వాలంటీర్లను గుర్తించి, వారికి మట్టి పరీక్షలు, మట్టి ఆరోగ్యం, సమతుల ఎరువుల వినియోగంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. రైతులు తమ మొబైల్ నంబర్లను ఏఈవోస్ వద్ద అప్డేట్ చేసుకోవడం ద్వారా యూరియా యాప్, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, వ్యవసాయ సలహాలు నేరుగా అందుతాయని వివరించారు.కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ఉద్యానవన శాఖ, వెజిటేబుల్ వాలంటీర్లను కూడా నియమిస్తుందని, వారిని వరి నుండి కూరగాయలు, ఆయిల్ ఫామ్ పంటలకు మార్పిడి చేయుటకు ఉపయోగించుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో సహాయ వ్యవసాయ సంచాలకుడు రణధీర్ రెడ్డి, కరీంనగర్ అర్బన్, రూరల్, కొత్తపల్లి మండల వ్యవసాయ అధికారులు వంశీ కృష్ణ, సత్యం, సంతోష్ కుమార్, అలాగే ఏఈవోలు పాల్గొన్నారు.

# 3 నెలల్లో 80,000 ఉద్యోగాలు గాయబ్!

**-ఈ సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారీగా కోతలు**
**-ప్రపంచ వ్యాప్త పరిస్థితిపై ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ నివేదిక**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో ఉద్యోగాల కోత కొనసాగుతూనే ఉన్నది. ఈ సంవత్సరం మొదటి మూడు నెలల్లో ప్రపంచవ్యాప్తంగా 80 వేల మంది ఉద్యోగాలు కోల్పోయినట్టు ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ తాజా నివేదిక వెల్లడించింది. కొవిడ్ సంక్షోభం తర్వాత అతి పెద్ద ఉద్యోగాల తొలగింపు ఇదేనని పేర్కొన్నది. 2021 నుంచి పది లక్షల మంది టెకీలు ఉద్యోగాలు కోల్పోయారని వెల్లడించింది. ఏఐ సంబంధిత పునర్ నిర్మాణం, ఆటోమేషన్‌కు వనరుల బదలాయింపు, మౌలిక సదుపాయాలు, సామర్థ్య పెంపునకు కంపెనీలు అధికంగా ఖర్చు చేయడం వల్ల ఉద్యోగాల కోత ఎక్కువైందని నివేదిక తెలిపింది. క్లౌడ్ కంప్యూటింగ్, సాఫ్ట్‌వేర్, సాఫ్ట్‌వేర్-యాజ్-ఎ-సర్వీస్(సాస్) కంపెనీల్లో ఉద్యోగాల కోతలు ఎక్కువగా ఉన్నట్టు వివరించింది. ఆ తర్వాతి స్థానంలో ప్రపంచవ్యాప్తంగా మొత్తం ఉద్యోగాల కోతలో అమెరికాలోనే 77 శాతం మందిని కొలువుల నుంచి తొలగించారు. భారత్ విషయానికి వస్తే 2 వేల మందిని ఇంటికి పంపారు. కంపెనీల పరంగా చూస్తే ఒరాకిల్ 26 వేలు, అమెజాన్ 16 వేలు, మెటా 2,400 ఉద్యోగాలను తొలగించాయి.


**ఖర్చుల తగ్గింపు కోసం కోతలు!**

కార్మిక శక్తి నిర్ణయాలను కృత్రిమ మేధ(ఏఐ) ప్రభావితం చేస్తున్నదని నివేదిక తెలిపింది. అయితే ఈ తొలగింపుల్లో చాలా వరకు ఆటోమేషన్ వల్ల కాకుండా, ముందు జాగ్రత్తగా ఖర్చులను తగ్గించే చర్యల్లాగా కనిపిస్తున్నాయని విశ్లేషించింది. 'ఏఐ భవిష్యత్తు పెట్టుబడి మాత్రమే కాదు, సంస్థాగత పునర్ నిర్మాణానికి, కార్మిక శక్తి నిర్ణయాలకు చోదక శక్తిగా మారింది' అని నివేదిక పేర్కొన్నది.

---

# కాల్పుల విరమణ ఉల్లంఘిస్తే ఇజ్రాయెల్‌పై దాడి చేసేందుకు సిద్ధం..


**-హెజ్బొల్లా సంస్థ హెచ్చరిక**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య పది రోజులపాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ ఇజ్రాయెల్‌కు హెచ్చరిక జారీ చేసింది. ఈ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తే, తిరిగి దాడులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. తమ వేళ్లు ఇంకా ట్రిగ్గర్ మీదే ఉన్నాయని చెప్పింది. ఇరాన్-అమెరికా మధ్య రెండు వారాల కాల్పుల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తాజాగా, ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కూడా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.పది రోజులపాటు కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి. ఇప్పటికే ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఈ విషయాన్ని కూడా అమెరికా వెల్లడించింది. ఇజ్రాయెల్-లెబనాన్ దేశాల నేతల మధ్య దశాబ్దాల తర్వాత తొలి సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించాడు. లెబనాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లా కూడా కాల్పుల విరమణ పాటిస్తూ, ఈ పది రోజులు ప్రశాంతంగా ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పాడు. దీనివల్ల ఎలాంటి చంపుకోవడాలు, దాడులు ఉండవని, శాంతి ఏర్పడుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ స్పందిస్తూ.. ఇజ్రాయెల్ కాల్పుల విరమణ పాటించకపోతే, తాము కూడా తిరిగి దాడులు చేస్తామని హెచ్చరించింది. ఈ ఒప్పందం నేపథ్యంలో లెబనాన్‌లోని ప్రజలు తమ సొంత ప్రాంతాలకు తిరిగి వెళ్తున్నారు. ఇంతకాలం యుద్ధం నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల ప్రజలు తమ ప్రాంతాల్ని ఖాళీ చేసి వెళ్లిపోయారు. అయితే, ఇప్పుడు శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో తిరిగి తమ సొంతూళ్లకు పయనమయ్యారు. ముఖ్యంగా బీరుట్ దక్షిణ ప్రాంతాల్లోని ప్రజలు తిరిగి వెళ్న?న్నారు. అయితే, ఈ అంశంపై లెబనాన్ ఆర్మీ హెచ్చరికలు జారీ చేసింది. ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లకూడదని హెచ్చరించింది. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని చైనా స్వాగతించింది. మరోవైపు ఇరాన్‌లో కిండర్‌గార్టెన్ స్కూల్స్ మూసివేయాలని ఆ దేశం నిర్ణయించింది. చిన్నారుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

# సెంటినలీస్ తెగవారికి కోక్ ఇచ్చిన యూట్యూబర్..

**ఐదేళ్ల జైలు శిక్ష పడే ఛాన్స్**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** : పురాతన సెంటినలీస్ తెగకు చెందిన వారికి కోక్ అందించిన యూట్యూబర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఈ కేసులో యూట్యూబర్‌కు పోర్ట్ బ్లెయిర్ కోర్టు బెయిల్ నిరాకరించింది. దీంతో అతడు ఈ నెలలో కోర్టుకు హాజరుకావాల్సి ఉంది. ప్రపంచంలోనే అత్యంత పురాతన, ప్రమాదకర తెగ సెంటినలీస్. ఇండియాకు చెందిన అండమాన్ దీవుల్లో 60,000 ఏళ్లుగా నివసిస్తున్నారు. ప్రపంచంలోని అనేక తెగలవాళ్లు ఇతర ప్రపంచంతో కలిసినా వారు మాత్రం అందరికీ దూరంగానే బతుకుతున్నారు. బాహ్య ప్రపంచంతో సంబంధాలుండవు. వారి దీవిలో మాత్రమే ఉంటారు.గతంలో ఎలా ఉండేవారో ఇప్పటికీ అలాగే ఉంటారు. ఇతరులు ఎవరైనా అక్కడికి ప్రవేశించాలని చూస్తే వారిని అంతం చేస్తారు. అలా ఇటీవలి కాలంలో ఇద్దరిని చంపేశారు కూడా. దీంతో ఆ ప్రాంతంలోకి వెళ్లడానికి ఎవరికీ అనుమతి ఉండదు. ఎవరైనా అలా వెళ్లేందుకు ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. తాజాగా నియో ఓరియెంటలిస్ట్ అనే ఒక యూట్యూబ్ ట్రావెల్ ఛానెల్ నిర్వహించే మైఖైలో విక్టోరోవిచ్ పోల్యాకోవ్ అనే వ్యక్తి సెంటినలీస్ ఉండే దీవుల్లోకి అక్రమంగా ప్రవేశించాడు. ఒక చిన్న పడవలో తొమ్మిది గంటలు ప్రవేశించి, అక్కడికి చేరుకుని ఐదు నిమిషాలు గడిపాడు. అక్కడి ఒక కొబ్బరి బోండాంలో డైట్ కోక్ ఉంచాడు. పైగా ఇదంతా అతడు వీడియో తీసి తన యూట్యూబ్ ఛానెల్‌లో పోస్ట్ చేశాడు. అక్కడివారు ఒకవేళ అది తాగితే ఈ తెగవారికి చాలా ప్రమాదం. ఎందుకంటే వారి ఆహారపు అలవాట్లు వేరు. మనం సాధారణంగా తీసుకునే ఆహారాన్ని వారు తీసుకోరు. అలాంటిది వారికి డైట్ కోక్ అందించడమంటే వారికి ప్రమాదాన్ని కల్పించినట్లే. దీనివల్ల అంటువ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉంది. ఇదంతా గత ఏడాది జరగగా అతడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతడు పోలీస్ కస్టడీలో ఉన్నాడు. ఆ తెగకు హాని కలిగించేందుకు ప్రయత్నించాడనే కారణంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంలో అతడు పోర్ట్ బ్లెయిర్ కోర్టులో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా, దీన్ని కోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో అతడు ఈ నెల 29న కోర్టుకు హాజరు కావాల్సి ఉంది. దీనిపై పూర్తి విచారణ పూర్తై, పోల్యాకోవ్ తప్పు చేశాడని తేలితే.. అతడికి ఐదేళ్ల జైలు శిక్ష పడే ఛాన్స్ ఉంది.

# పశ్చిమ బెంగాల్ బరిలో కిమినల్స్

**-తొలిదశ ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థుల చిట్టా**
**-23 శాతం మంది నేరచరితులు**
**-21 శాతం మంది కోటీశ్వరులు : ఏడీఆర్ నివేదికలో వెల్లడి**



**కోల్‌కతా ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలివిడతలో పోటీ చేస్తున్న ప్రతి నలుగురు అభ్యర్థుల్లో ఒకరిపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు వారు ప్రకటించుకున్నారని 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. విశ్లేషించిన 1,475 మంది అభ్యర్థుల్లో 345 మంది (23 శాతం) పై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 294 మంది (20 శాతం) తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 19 మంది అభ్యర్థులపై హత్యకు సంబంధించిన కేసులు, 105 మంది అభ్యర్థులపై హత్యాయత్నానికి సంబంధించిన కేసులు ఉన్నాయని ప్రకటించుకున్నారని ఈ నివేదిక తెలిపింది. అదనంగా 98 మంది అభ్యర్థులు మహిళలపై నేరాలకు సంబంధించిన ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. వీరిలో ఆరుగురు లైంగికదాడి కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ప్రధాన పార్టీలలో, క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థుల నిష్పత్తి బీజేపీలోనే అత్యధికంగా ఉంది. ఆ పార్టీకి చెందిన 152 మంది అభ్యర్థుల్లో 106 మంది (70 శాతం) తమపై కేసులు ఉన్నట్టు ప్రకటించుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో టీఎంసీ (63 మంది అభ్యర్థులు(43 శాతం)), కాంగ్రెస్ (39 మంది అభ్యర్థులు(26 శాతం)) నిలిచాయి. తీవ్రమైన క్రిమినల్ కేసుల విషయంలోనూ ఇదే తరహా ధోరణి కనిపించింది. బీజేపీ అభ్యర్థుల్లో 63 శాతం, టీఎంసీలో 32 శాతం, కాంగ్రెస్ అభ్యర్థుల్లో 22శాతం మంది తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. తొలిదశ ఎన్నికలు జరుగుతున్న నియోజకవర్గాలలో సుమారు 43 శాతం అంటే, మొత్తం 66 నియోజక వర్గాలను ఈ నివేదిక "రెడ్ అలర్ట్ నియోజకవర్గాలుగా" గుర్తించింది. ఈ నియోజకవర్గాలలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు ప్రకటించుకున్నారు. నేరచరిత్ర కలిగిన అభ్యర్థుల ఎంపికను సమర్థించుకోవాలని రాజకీయ పార్టీలను సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, పార్టీలు మాత్రం ప్రజాదరణ లేదా రాజకీయ ప్రేరేపిత కేసులు వంటి "నిరాధారమైన" కారణాలనే చూపుతూనే ఉన్నాయని ఏడీఆర్ పేర్కొంది. ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలనే ఆసక్తి రాజకీయ పార్టీలకు లేదని ఈ గణాంకాలు స్పష్టంగా చూపిస్తున్నాయి," అని ఆ నివేదిక తెలిపింది. ఆర్థిక పరంగా చూస్తే, 309 మంది అభ్యర్థులు (21 శాతం) కోటీశ్వరులు ఉన్నారు. వీరిలో ఒక్కో అభ్యర్థి సగటు ఆస్తుల విలువ రూ. 1.34 కోట్లుగా నమోదైంది. సగటు ఆస్తుల విషయంలో టీఎంసీ అగ్రస్థానంలో ఉంది. ఈ పార్టీ అభ్యర్థులు సగటున రూ. 5.70 కోట్ల ఆస్తులను ప్రకటించారు. ఆ తర్వాతి స్థానాల్లో బీజేపీ (రూ. 2.57 కోట్లు), కాంగ్రెస్(రూ. 2.06 కోట్లు) ఉన్నాయి. అత్యంత సంపన్న అభ్యర్థుల జాబితాలో టీఎంసీకి చెందిన జాకిర్ హుస్సేన్ అగ్రస్థానంలో ఉన్నారు. ఆయన రూ.133 కోట్లకు పైగా ఆస్తులను ప్రకటించారు. ఆ తర్వాతి స్థానాల్లో టీఎంసీకి చెందిన గౌతమ్ మిత్రా (రూ.105 కోట్లకు పైగా) , కబీ దత్తా (రూ. 72 కోట్లకు పైగా) ఉన్నారు.?యంత తక్కువ ఆస్తులు కలిగిన ముగ్గురు అభ్యర్థులు రూ.1,000 కంటే తక్కువ విలువైన ఆస్తులను ప్రకటించారు.

# టీపీసీసీ డాక్టర్స్ సెల్ చైర్మన్‌గా మహేష్ కుమార్



**పెద్దపల్లి, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** టీపీసీసీ డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ విభాగం పెద్దపల్లి జిల్లా చైర్మన్‌గా వైద్యుడు ఇటుకల మహేష్ కుమార్ నియమితులయ్యారు.హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాజీవ్ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# సీఎం సభను విజయవంతం చేయాలి

**-- విప్ విజయరమణారావు**



**ఎలిగేడు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈనెల 20న కాటారం మండలంలో జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కోరారు.శివపల్లి గ్రామంలో తన నివాసంలో ఎలిగేడు, జూలపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులతో సమావేశమై సభ విజయవంతం కోసం దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**-- టీజీఆర్ఎస్ఏ**




**ఎలిగేడు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** టీజీఈజేఏసీ పిలుపు మేరకు ఎలిగేడు తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు.జిల్లా ప్రధానకార్యదర్శి సీహెచ్. అనిల్ కుమార్ మాట్లాడుతూ, పెండింగ్లో ఉన్న పీఆర్సీని జూన్ 2లోపు అమలు చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల బిల్లులు విడుదల చేయాలని, పెండింగ్ డీఏలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.అలాగే వీఆర్ఏలకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, సాధారణ బదిలీలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి, చంద్రశేఖర్, జయలక్ష్మి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గురుకుల వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



**మహబూబాబాద్, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశిరాం నాయక్ మాట్లాడుతూ, 2026--27 విద్యా సంవత్సరానికి వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలని సూచించారు.ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా బడిబాటను విజయవంతం చేయాలని, సంక్షేమ వారంలో జరిగే కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో ఏటీడీవోలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, ఎస్సిఆర్పీలు పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్

**ఎలిగేడు, ఏప్రిల్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని ఎస్సై మధుకర్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు.వారి వద్ద నుంచి జుపిటర్ స్కూటీ, మొబైల్ ఫోన్, ?2010 నగదు, పేకాట కార్డులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# బిజినెస్

## స్మార్ట్‌ఫోన్ ధరలకు రెక్కలు..
## కనీస పెంపు 15 శాతం.. బడ్జెట్ ఫోన్లకే సమస్య

దేశంలో స్మార్ట్ ఫోన్ వినియోగదారులకు షాకిస్తున్నాయి. వరుసగా స్మార్ట్‌ఫోన్ల ధరలు పెరుగుతుండటం వినియోగదారుల్ని కలవరపెడుతోంది. చిప్స్ సహా ఫోన్ కంపోనెంట్స్ ధరలు పెరగడం, కంపెనీలకు లాభాల మార్జిన్లు తగ్గడం, అంతర్జాతీయ పరిణామాల వల్ల పలు ఉత్పత్తుల రవాణా నిలిచిపోవడం వంటివి ఫోన్ల ధరలు పెరగడానికి కారణాలుగా తెలుస్తోంది. ప్రస్తుతం చాలా ఫోన్లు సామాన్యులకు అందుబాటులో లేకుండా ధరలు పెరిగాయి.ఒక కేటగిరి నుంచి ఇంకో కేటగిరిలోకి ధరలు చేరిపోయాయి. గతంలో చాలా కాలం క్రితం విడుదలైన మోడల్స్, ఇంతకుముందు తక్కువ ధరకు లభించిన ఫోన్లు కూడా ఇప్పుడు అధిక ధరలకు దొరుకుతున్నాయి. గత మార్చి నుంచి స్మార్ట్‌ఫోన్ల ధరలు పెరుగుతున్నట్లు మార్కెట్ నివేదికలు చెబుతున్నాయి. అన్ని రకాల ఫోన్ల ధరలు పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్లో 200 రకాల స్మార్ట్‌ఫోన్లు ఉండగా, వాటిలో 80 మోడళ్ల ధరలు ఇప్పటికే పెరిగాయి. సగటున 15 శాతం ధరలు పెరిగాయి. త్వరలో మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఎక్కువ ధరల ప్రభావానికి గురవుతున్నవి మాత్రం మీడియం, ఎంట్రీ లెవల్ ఫోన్లే. రూ.15,000లోపు ధర కలిగిన ఫోన్లు ఎక్కువగా రేట్లు పెరుగుతున్నాయి. దీంతో ఈ ఫోన్ల



అమ్మకాలు ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 33 శాతం పడిపోయాయి. ఈ తరహా ఫోన్లలో చాలా తక్కువ మార్జిన్లు వస్తుంటాయి.తయారీ, ఇతర ఖర్చులు పెరగడంతో కంపెనీలు ఈ భారాన్ని వినియోగదారులపై మోపుతున్నాయి. దీంతో ఎంట్రీ లెవల్ ఫోన్లు కూడా అందుబాటులో లేకుండా పోయాయి. రూ.15 వేల నుంచి రూ.30 వేల ధరలోపు ఫోన్లు మాత్రం ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. మార్కెట్లో వీటి వాటా 35 నుంచి 45 శాతం పెరిగాయి. అయితే, ఇందులో చాలా ఫోన్లు గతంలో బడ్జెట్ రేంజ్‌లోనే ఉండేవి. ఇప్పుడు మీడియం రేంజ్‌లో లభిస్తున్నాయి. దీంతో బడ్జెట్ రేంజ్‌లో ఇప్పుడు సరైన ఫోన్లు లభించడం లేదు. ఇప్పటికే ఫోన్ల ధరల పెరుగుదలతో వినియోగదారులు ఇబ్బంది పడుతుంటే, రాబోయే రోజుల్లో మరో 15 శాతం ధరలు పెరిగే ఛాన్స్ ఉందని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. కొత్తగా రాబోతున్న ఫోన్లు కూడా వాటి ఫీచర్లతో పోలిస్తే కనీసం 30 నుంచి 40 శాతం ధరలు పెంచి విక్రయించే ఛాన్స్ ఉంది.

### ఒక్కసారిగా కుప్పకూలిన
## బంగారం, వెండి ధరలు..
**ఉన్నట్లుండి భారీగా పతనం.. ఇప్పుడు తులం ఎంతంటే..?**



బంగారం ధరల పెరుగుదలకు బ్రేక్ పడింది. ఉన్నట్లుండి ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. ధరలు ఒక్కసారిగా భారీగా పతనమయ్యాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి ఇదే మంచి అవకాశంగా చెప్పవచ్చు. సోమవారం నుంచి ధరలు పెరుగుతూనే వస్తుండగా.. ఇప్పుడు ఒకసారిగా బ్రేక్ పడినట్లయింది. శుక్రవారం గంటల్లోనే ధరలు తారుమారు అయ్యాయి. లేటెస్ట్ రేట్లు ఇలా..హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,54,200 వద్ద కొనసాగుతోంది. ఉదయం రూ.1,55,570 వద్ ఉండగా.. ఒక్కసారిగా రూ.1370 కుప్పకూలింది. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,41,350 వద్ద ఇప్పుడు కొనసాగుతోండగా... ఉదయం రూ.1,42,600 వద్ద ఉంది. దీనిపై రూ.1250 తగ్గిందని చెప్పవచ్చు.జోతిష్య శాస్త్రం ప్రకారం, ఒక్కో లోహానిని ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. బంగారం బృహస్పతి గ్రహానికి సూచికగా చెబుతారు. ఇది సంపదను రెట్టింపు చేస్తుంది. అయితే, కొందరికి మాత్రమే బంగారం శుభాన్ని ఇస్తుంది. ఇక రాశుల్లో వీరు బంగారం ధరిస్తే వారి జతకమే మారుతుంది.అటు బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,200 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,41,350 వద్ద ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,54,350 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,41,500 వద్ద ఉంది.ఇక వెండి ధరలు కూడా కుప్పకూలాయి. ప్రస్తుతం ఢిల్లీలో కేజీ సిల్వర్ రూ.2.65 లక్షల వద్ద ట్రేడవుతోంది. ఇది ఉదయం రూ.2.70 లక్షలుగా ఉంది. ఒకేసారి రూ.5 వేలు తగ్గింది. ఇక హైదరాబాద్‌లో కేజీ సిల్వర్ రూ.2.75 లక్షల వద్ద ఉంది. ఇక చెన్నైలో కూడా ఇదే ధర కొనసాగుతోంది

## విప్రో 15 వేల కోట్లబైబ్యాక్

న్యూఢిల్లీ,
విప్రో నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.3,501.8 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.6 శాతం ఎగబాకి రూ.24,236.3 కోట్లకు చేరుకున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.92,624 కోట్ల ఆదాయంపై రూ.13,197.4 కోట్ల నికర లాభాన్ని గడించింది.మరోవైపు, ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా గురువారం కంపెనీ బోర్డు సమావేశమై రూ.15 వేల కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు ప్రక్రియకు ఆమోదం తెలిపింది. కంపెనీ చరిత్రలో ఇంతటి స్థాయిలో షేర్లను బైబ్యాక్ చేయడం ఇదే తొలిసారి.

## సన్ రైజర్స్ జట్టుకు గాయాల బెడద

# స్పోర్ట్స్

**-సీమర్ డేవిడ్ పేన్ చీలమండ గాయం**
**-ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే చాన్స్!?**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టును గాయాల బెడద వెంటాడుతూనే ఉంది. త్తజాగా ఈ మాజీ ఛాంపియన్ కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇంగ్లాండ్ లెఫ్ట్ ఆర్మ్ సీమర్ డేవిడ్ పేన్ చీలమండ గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా అధికారికంగా ధృవీకరించింది. 35 ఏళ్ల పేన్ ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో రెండు వికెట్లు తీసి పర్వాలేదనిపించాడు. ముఖ్యంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతను త్వరగా కోలుకోవాలని టీమ్ సభ్యులు ఆకాంక్షించారు. నిజానికి ఈ సీజన్‌లో ఎస్‌ఆర్‌హెచ్ ప్లేయర్లు గాయపడటం ఇది మొదటిసారి కాదు. అంతకుముందు ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ చేతి గాయంతో టోర్నీ ప్రారంభంలోనే నిష్క్రమించాడు. అతని స్థానంలో శ్రీలంక ఫాస్ట్ బౌలర్ దిల్షాన్ మధుశంకను జట్టులోకి తీసుకున్నారు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదు మ్యాచ్‌ల్లో రెండు



విజయాలు, మూడు ఓటములతో నాలుగో స్థానంలో ఉన్న హైదరాబాద్ జట్టుకు ఈ గాయాలు ఒక పెద్ద సవాలుగా మారాయి. ప్రస్తుతం జట్టు నెట్ రన్ రేట్ ం0.576 గా ఉంది.ఒకవైపు డేవిడ్ పేన్ దూరం అవ్వడం ఇబ్బంది కలిగించినా, మరోవైపు ఎస్‌ఆర్‌హెచ్ ఫ్యాన్స్‌కు ఒక అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. జట్టు రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఫిట్‌నెస్ టెస్ట్ క్లియర్ చేశాడు. త్వరలోనే అతను స్క్వాడ్‌తో చేరబోతున్నాడు. ఏప్రిల్ 25న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో కమిన్స్ బరిలోకి దిగే అవకాశం ఉంది. కమిన్స్ అందుబాటులో లేని సమయంలో ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. కిషన్ సారథ్యంలో టీమ్ రెండు మ్యాచ్‌ల్లో గెలిచి తన ఉనికిని చాటుకుంది. గత సోమవారం టేబుల్ టాపర్స్ రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ అద్భుత విజయం సాధించింది. 217 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన ఎస్‌ఆర్‌హెచ్, ప్రత్యర్థిని 159 పరుగులకే కట్టడి చేసింది. అరంగేట్రం చేసిన యువ బౌలర్లు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ చెరో నాలుగు వికెట్లు తీసి రాజస్థాన్ పతనాన్ని శాసించారు. 57 పరుగుల తేడాతో గెలిచిన ఆరెంజ్ ఆర్మీ ఇప్పుడు ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉంది. శనివారం తమ హోమ్ గ్రౌండ్ అయిన ఉప్పల్ స్టేడియంలో ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తో తలపడనుంది. హోమ్ క్రౌడ్ ముందు రుతురాజ్ సేనను ఓడించి విజయ పరంపరను కొనసాగించాలని హైదరాబాద్ ప్లాన్ చేస్తోంది. సొంతగడ్డపై రాయల్స్ పై గెలుపొందడం, చెన్నైతో మ్యాచ్ కూడా సొంతగడ్డపైనే జరుగనుండటంతో ఈ విజయంపై కన్నేసింది. ఇక డబుల్ హెడర్ లో భాగంగా శనివారం రాత్రి ఈ మ్యాచ్ జరుగుతుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ పై ఫుల్ క్రేజ్ ఉండగా, టికెట్లకు భారీ డిమాండ్ ఉంది.

## ఢిల్లీతో మ్యాచ్‌కు గ్రీన్ జెర్సీలో..




**బెంగళూరు**
ఐపీఎల్‌లో తమ రెగ్యులర్ జెర్సీ (ఎరుపు)కి బదులు ఒక మ్యాచ్‌కు ఆకుపచ్చ జెర్సీల్లో ఆడే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఆటగాళ్లు ఈ సీజన్‌లో శనివారం చిన్నస్వామి వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగబోయే మ్యాచ్‌కు గ్రీన్ జెర్సీల్లో ఆడనున్నారు.గ్రీన్ ఇన్షియేటివ్' కార్యక్రమంలో భాగంగా 2011 నుంచి ఆర్‌సీబీ ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నది.

## నా రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొడతాడు

**గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్**

టీమిండియా స్టార్ క్రికెటర్, గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో అత్యంత కీలక విషయం క్లారిటీ అని వాషింగ్టన్ సుందర్ పేర్కొన్నారు. స్టేడియంలోకి వెళ్లే ముందే ప్రతి ఆటగాడికి తన బాధ్యత ఏంటో.. కెప్టెన్ తన నుంచి ఏం ఆశిస్తున్నాడో గిల్ చాలా స్పష్టంగా వివరిస్తాడని సుందర్ చెప్పుకొచ్చాడు. ఈ విధానం వల్ల ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గి, ప్రశాంతంగా తమ సహజసిద్ధమైన ఆటను ఆడగలుగుతున్నారని పేర్కొన్నాడు.భారత క్రికెట్‌లో ప్రస్తుతం సెన్సేషన్‌గా మారిన బీహార్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ గురించి వాషింగ్టన్ సుందర్ గొప్పగా మాట్లాడాడు. టీ20 క్రికెట్‌లో భారత్ తరపున అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా తన పేరిట ఉన్న రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొట్టే అవకాశం




ఉందని ఆయన అభిప్రాయపడ్డాడు. వైభవ్ వయసు తక్కువైనా అతని ఆలోచనా విధానం, నైపుణ్యం చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుందని, అతడు భవిష్యత్తులో టీమిండియాకు సుదీర్ఘ కాలం ఆడుతాడని వాషింగ్టన్ సుందర్ ఆశాభావం వ్యక్తం చేశాడు.టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌కు, గుజరాత్ టైటాన్స్ డ్రెస్సింగ్ రూమ్‌కు పెద్దగా తేడా ఏమీ లేదని సుందర్ తెలిపాడు. ఇక్కడ ఆటగాళ్లందరి మధ్య మంచి సమన్వయం ఉందని, జట్టులోని భారతీయ ఆటగాళ్లంతా టీమిండియాలో కూడా కలిసి ఆడిన వారు కావడంతో ఒకరి గురించి ఒకరికి బాగా తెలుసని చెప్పాడు. కేవలం మైదానంలోనే కాకుండా టీమ్ రూమ్‌లో కూడా అందరం కలిసి ఎక్కువ సమయం గడపడం వల్ల ఓ కుటుంబంలా కలిసిపోయామని, ఈ వాతావరణమే గుజరాత్ టైటాన్స్ జట్టును ప్రత్యేకంగా నిలుపుతుందని పేర్కొన్నాడు.కోచ్ ఆశిష్ నెహ్రా గురించి మాట్లాడుతూ.. ఆయనతో కలిసి పనిచేయడం ఎప్పుడూ గొప్ప అనుభూతినిస్తుందని వాషింగ్టన్ సుందర్ తెలిపాడు. గత నాలుగేళ్లుగా గుజరాత్ జట్టుతో నెహ్రాకు ఉన్న అనుబంధం అద్భుతమని, ఆయన ఆటగాళ్ల బలాలు, బలహీనతలను చాలా సులభంగా అర్థం చేసుకుంటారని కొనియాడాడు. ఐపీఎల్ తన జీవితాన్ని మార్చివేసిందని, 2017లో మొదలైన తన ప్రయాణం ఇప్పుడు ఒక దశాబ్దానికి చేరువవుతోందని, సీనియర్ ఆటగాడిగా తన బాధ్యతలను నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నానని వాషింగ్టన్ సుందర్ స్పష్టం చేశాడు.

## భారత్ 157/7




**డర్బన్:**
దక్షిణాఫ్రికాతో తొలి టీ20 పోరులో భారత మహిళల జట్టు ఆకట్టుకుంది. టీ20 ప్రపంచకప్ సన్నాహాలోల భాగంగా శుక్రవారం జరిగిన పోరులో తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 157/7 స్కోరు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ (47 నాటౌట్), రోడ్రిగ్స్ (36) రాణించారు. ఓపెనర్లు షెఫాలీవర్మ (34), మందన (13) మెరుగైన శుభారంభం అందించారు. ఖాక (3/16), తుమి సెకునె(2/27) ఆకట్టుకున్నారు.